ANN తెలుగు
Follow: @ANNTELUGU
28-12-2024
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 27 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్

## కవితక్క కార్యక్రమంలో సీతక్క

- కవిత పాల్గొన్న కార్యక్రమంలో..
- 'సీతక్క' అంటూ ప్రసంగం ప్రారంభించిన సిక్కు నేత
- కవిత నివాసంలో 40 బీసీ సంఘాలతో సమావేశం
- సభను ఏర్పాటు చేసిన సీతక్కకు నమస్కారం అన్న సిక్కు నేత
- సీతక్క అనడంతో నవ్విన కవిత



02

## మేఘాకు సుప్రీంకోర్టు బిగ్ షాక్

- ఆ వివరాలు ఇవ్వాలని ఆదేశాలు
- పాలమూరు అంచనాలు పెంచిన గత ప్రభుత్వం
- ప్రభుత్వ ఖజానాకు రూ. 2,426.07 కోట్ల నష్టం
- సుప్రీంకోర్టులో వాదనలు.. విచారణ ఫిబ్రవరి 10కి వాయిదా



02

## రోజా పుత్రికోత్సాహం

- అరుదైన ఘనత సాధించిన అన్షు మాలిక
- గ్లోబల్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అవార్డు



02



## పవర్ ఫుల్ సీఎం రేవంత్
# తెలంగాణ గేమ్ ఛేంజర్

ఓ వైపు ఎన్నికలు.. మరోవైపు ప్రత్యర్థుల విమర్శలు.. ఇంకోవైపు సొంతపార్టీ ఆశావహులు ఇలా ఎన్నెన్నో తలపోట్లు ఉన్నా.. అన్నింటినీ తట్టుకుని పదమూడు మాసాలుగా పదమూడు శాఖల భారం మోస్తూ, ప్రధాన ప్రత్యర్థి బీఆర్ఎస్ ను లోక్ సభలో సున్నాకు పరిమితం చేసి అటు రాజకీయంగా ఇటు ప్రభుత్వపరంగా ఫీల్ గుడ్ వాతావరణం కొనసాగించడమంటే పెద్దసాహసం. ఈ సాహసం చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ గేమ్ ఛేంజర్ గా మారారు. ఒకప్పుడు కేసీఆర్ కేంద్రంగా సాగిన రాజకీయాలు.. ఇపుడు పూర్తిగా రేవంత్ చుట్టూ తిరుగుతున్నాయి.

పదమూడు మాసాలుగా కేబినెట్ విస్తరణ జరపకుండా జాతీయపార్టీలో నెట్టుకురావడం చరిత్రలో రికార్డు. ఇలాంటి అదృష్టం గతంలో ఏ ముఖ్యమంత్రికీ కలగలేదు. సీఎంకు కూడా ఇంత భారం మోయడం ఇష్టం లేకున్నా.. పరిస్థితులు అలా మోసుకెళ్ళాయి. రాజకీయ ప్రత్యర్థులకు సరైన వ్యూహరచన లేకపోవడం, కాంగ్రెస్ పార్టీపై తనకు ఉన్న తిరుగులేని పట్టు, జాతీయ రాజకీయ పరిస్థితులు అన్నీ ముఖ్యమంత్రి రేవంత్ ను పవర్ ఫుల్ చేశాయి.

**కేసీఆర్ రికార్డులు బ్రేక్**

**పొలిటికల్ గా స్ట్రాంగ్.. కీలకశాఖలన్నీ తన వద్దే ఉన్నా భారం బ్యాలెన్స్**
**మహేష్ గౌడ్, బండి, రఘునందన్, చామలలకు కలిసొచ్చిన కాలం**

గత ముఖ్యమంత్రి కేసీఆర్ 66రోజులు మంత్రివర్గ విస్తరణ చేయకపోతే.. రాష్ట్రంలో పెద్ద ఎత్తున గగ్గోలు నడిచింది. తర్వాత ఆరుఖాళీలు ఆరుమాసాలు ఉంచినా.. అదే రగడ. ఆయనే అప్పట్లో కేబినెట్ జాప్య ఒత్తిడిని, విమర్శలను తట్టుకోలేకపోయారు. ఓ వైపు ఎన్నికలు.. మరోవైపు ప్రత్యర్థుల విమర్శలు.. ఇంకోవైపు సొంతపార్టీ ఆశావహులు ఇలా ఎన్నెన్నో తలపోట్లు ఉన్నా.. అన్నింటినీ తట్టుకుని పదమూడు మాసాలుగా పదమూడు శాఖల భారం మోస్తూ, ప్రధాన ప్రత్యర్థి బీఆర్ఎస్ ను లోక్ సభలో సున్నాకు పరిమితం చేసి అటు రాజకీయంగా ఇటు ప్రభుత్వపరంగా ఫీల్ గుడ్ వాతావరణం కొనసాగించడమంటే పెద్దసాహసం. ఈ సాహసం చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ గేమ్ ఛేంజర్ గా మారారు. ఒకప్పుడు కేసీఆర్ కేంద్రంగా సాగిన రాజకీయాలు.. ఇపుడు పూర్తిగా రేవంత్ చుట్టూ తిరుగుతున్నాయి. టార్గెట్ చేసినా, ప్రశంసించినా అన్నింటికీ అయనే కేంద్రం. తెలంగాణ పాలిటిక్స్ పై, ప్రభుత్వంపై పూర్తిపట్టు సాధించిన సీఎం 2024 తనదేనని చాటారు. వినూత్న పథకాలు, కార్యక్రమాలు, రాజకీయాలతో మ్యాన్ ఆఫ్ ది ఇయర్ గా నిలిచారు.

- మహా, హైదరాబాద్

వివరాలు 3లో



# మన్మోహనా నీ ముద్ర పదిలం..

## మన్మోహన్ సింగ్‌కు కేంద్ర కేబినెట్ ఘన నివాళి

- శనివారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- ప్రధాని మోడీ, అమిత్ షా సహా కేంద్రమంత్రుల నివాళులు
- మన్మోహన్‌కు కడసారి వీడ్కోలు పలికిన సోనియా
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా రాష్ట్రనేతల నివాళి

మన్మోహన్ సింగ్ భారతదేశ స్థితి గతులను మార్చిన ఓ ఆర్థిక మేధావి.. దేశ చరిత్రలో ఓ భాగం.. చరిత్ర మర్చిపోలేని ఓ పేరు.. భవిష్యత్ తరాలకు ఆయనొక స్ఫూర్తి.. ఎవ్వరికీ అందని ఖ్యాతి.. రాగద్వేషాలు లేని స్వచ్ఛమైన దేశ ప్రజల ప్రేమను పొందిన ఆయన కీర్తి.. ప్రతిపక్షాలు కూడా ఇష్టపడే ఏకైక ప్రధాని మన్మోహనుడు ఇక లేరు. పార్లమెంటు సభల్లో ఆయన మాటలు వినిపించవు. ఆయనిక కనిపించరు. దేశం మర్చిపోలేని ఈ నేత లేని లోటు తీర్చలేనిది. దేశంమెచ్చిన నేత ఓ మౌనముని నీకివే మా ఘన నివాళులు.

ప్రత్యేక కథనం 4లో







## బ్రిడ్జిపై నుంచి కాల్వలోకి పడిపోయిన బస్సు

8 మంది మృతి
18 మందికి తీవ్ర గాయాలు

02

## అల్లు అర్జున్ కేసు విచారణ 30కి వాయిదా

**వర్చువల్‌గా విచారణ**

నాంపల్లి కోర్టులో అల్లు అర్జున్‌కు దక్కని ఊరట
రెగ్యులర్ బెయిల్ పటిషన్‌పై విచారణ 30కి వాయిదా



02


## తెలంగాణ నేతల సిఫార్సు లేఖలు ఆమోదం

**షరతులతో ఓకే చెప్పిన టీటీడీ**

వారానికి రెండు రోజులే సిఫారసు లేఖలకు అనుమతి



వివరాలు 2లో



## డిసెంబర్ 31న నిర్ణయం

- కేటీఆర్ కేసుపై హైకోర్టు.. అప్పటిదాకా కేటీఆర్ అరెస్ట్ వద్దు
- నాట్ టు అరెస్ట్‌ను ఎత్తివేయాలని కోరిన ఏసీబీ

హైదరాబాద్, మహా: ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధించి శుక్రవారం తెలంగాణ హైకోర్టులో విచారణ సాగింది. మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ పై విచారణ సాగింది. గత విచారణ సందర్భంగా కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీ ని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో, ఏసీబీ శుక్రవారం కౌంటర్ దాఖలు చేసింది.

మిగతా 2లో



## మచ్చలేని మహామనిషి మన్మోహన్ సింగ్

- ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంఛార్జి కంది శ్రీనివాస రెడ్డి
- కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో ప్రజాసేవాభవన్ లో సంతాప సభ
- పెద్ద సంఖ్యలో హాజరైన కాంగ్రెస్ శ్రేణులు

02


తెలంగాణ నేతల సిఫార్సు

# లేఖలు ఆమోదం

## శరతులతో ఓకే చెప్పిన టీటీడీ

### వారానికి రెండు రోజులే సిఫారసు లేఖలకు అనుమతి

**తిరుమల, మహా :** టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. కొంత కాలంగా తెలంగాణ ప్రజా ప్రతినిధుల లేఖల పైన దర్శనం, వసతి కల్పించాలనే డిమాండ్లు వస్తున్నాయి. ఈ మేరకు ఇప్పటికే తెలంగాణ నేతల నుంచి విమర్శలు ఎదురయ్యాయి. తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలు ఆమోదించాలని కోరుతున్నారు. దీనిపైన తాజాగా తెలంగాణ సీఎం రేవంత్ అభ్యర్ధన మేరకు చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. సీఎం సూచనతో టీటీడీ ఇక తెలంగాణ ప్రజా ప్రతినిధుల లేఖల ఆమోదం పై నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి ఏపీతో పాటుగా తెలంగాణ ప్రజా ప్రతినిధుల దర్శనం, వసతి కోసం ఇచ్చే సిఫార్సు లేఖలను ఆమోదించాలని టీటీడీ నిర్ణయించింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత పలువురు తెలంగాణ ప్రజా ప్రతినిధులు తిరుమలలో తమ లేఖలకు సైతం ప్రాధాన్యత ఇవ్వాలని.. తెలంగాణ నుంచి వచ్చే భక్తులకు లేఖలు ఇచ్చేందుకు తమకు వెసులుబాటు కల్పించాలని కోరుతూ వచ్చారు. ఇరు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు రేవంత్ మధ్య తాజాగా ఇదే అంశం పైన చర్చ జరిగింది. తెలంగాణ ప్రజా ప్రతినిధుల లేఖలకు తిరుమలలో ప్రాధాన్యత ఇచ్చేలా నిర్ణయం తీసుకోవాలని రేవంత్ కోరారు. సీఎం రేవంత్ అభ్యర్ధన మేరకు చంద్రబాబు సానుకూలం



గా స్పందించారు. తెలంగాణ ప్రజా ప్రతినిధులు ఇచ్చే స్వామి వారి దర్శనం.. వసతి, సేవల విషయంలో ఏపీ ప్రజా ప్రతినిధుల తరహాలోనే అవకాశం కల్పించాలని టీటీడీకి సూచించారు. దీంతో, టీటీడీ తాజాగా ఈ అంశం పైన నిర్ణయం వెలువరించింది. ఇక నుంచి తెలంగాణ ప్రజా ప్రతినిధులు ప్రస్తుతం హోదాలో ఉన్న వారు ఇచ్చే సిఫార్సు లేఖలను ప్రతీ వారం రెండు రోజుల పాటు అంగీకరించాలని నిర్ణయం తీసుకున్నారు. దీని ద్వారా తెలంగాణ నుంచి వచ్చే భక్తులకు వెసులుబాటు కలుగుతుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం అమలుకు నిర్ణయించారు. దీంతో, కొత్త ఏడాది నుంచి తెలంగాణ ప్రజా ప్రతినిధుల లేఖలను టీటీడీ అనుమతించనుంది.

# డిసెంబర్ 31న నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా జరిగిన విచారణలో కేటీఆర్ ను అరెస్టు చేయకుండా జారీ చేసిన ఉత్తర్వుల ను ఈనెల 31 వరకు హైకోర్టు పొడిగించింది. తదుపరి విచారణను 31వ తేదీకి వాయిదా వేయగా, కేటీఆర్ ను అరెస్టు చేయకుండా జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఏసీబీ హైకోర్టు ను విచారణ సందర్భంగా కోరింది. ఇప్పటి వరకు ఫార్ములా ఈరేస్ వ్యవహారానికి సంబంధించి సుదీర్ఘంగా వాదనలు వినిపించిన తర్వాత కేటీఆర్‌కు హైకోర్టు స్వల్ప ఊరటనిచ్చింది. అయితే దాన్ని కూడా ఎత్తివేయాలని, పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఏసీబీ పిటిషన్‌లో పేర్కొంది. ఈ సమయంలో కేటీఆర్‌కు బెయిల్ మంజూరు చేసినా, రిలీఫ్ ఇచ్చినా, నాట్ టు అరెస్ట్ ఇచ్చినా విచారణకు ఇబ్బందికర వాతావరణం ఉంటుందని ఏసీబీ వెల్లడించింది. నాట్ టు అరెస్ట్‌ను ఎత్తివేయాలని ఏసీబీ మరో పిటిషన్‌ను వేసింది. ఆ పిటిషన్‌కు సంబంధించి ప్రతివాదిగా కేటీఆర్‌ను చేర్చారు. దీంతో కేటీఆర్ కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. డిసెంబర్ 31న ఫార్ములా ఈ కార్ రేస్‌పై ప్రభుత్వం వేసిన పిటిషన్‌పైన వాదనలు కొనసాగుతాయి. అలాగే నాట్ టు అరెస్ట్‌పై కేటీఆర్ కౌంటర్ దాఖలు చేసిన తర్వాత వాదనలు జరుగనున్నాయి. ఈ రెండు అంశాలపై డిసెంబర్ 31న ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత తెలంగాణ హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకోబోతుంది అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

# అల్లు అర్జున్ కేసు విచారణ 30కి వాయిదా

**హైదరాబాద్, మహా:** సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన కేసులో ఏ11గా ఉన్న సినీనటుడు అల్లు అర్జున్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా పడింది. శుక్రవారం విచారణ జరిపిన నాంపల్లి కోర్టు సోమవారానికి వాయిదా వేసింది. గతంలో అల్లు అర్జున్‌కు నాంపల్లికోర్టు 14రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. గడువు శుక్రవారంతో ముగుస్తుండటంతో తెలంగాణ హైకోర్టు నుంచి తనకు మధ్యంతర బెయిల్ మంజూరైందని విచారణ సందర్భంగా అల్లు అర్జున్ కోర్టుకు విన్నవించారు. అదేవిధంగా ఇప్పటికే ఆయన రెగ్యులర్ బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేయగా.. ఆ పిటిషన్‌పై మెజిస్ట్రేట్ విచారణ చేపట్టారు. అయితే, కేసులో కౌంటర్ దాఖలు చేసేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మరికొంత సమయం కావాలని న్యాయమూర్తిని కోరారు. దీంతో ఆయన కేసు తదుపరి విచారణ ఈ నెల 30కి వాయిదా వేశారు.

**వర్చువల్‌గానే హాజరు..**

నాంపల్లి కోర్టుకు అల్లుఅర్జున్ వర్చువల్‌గా హాజరయ్యారు. అసలు అల్లు అర్జున్ స్వయంగా కోర్టు ముందు హాజరవుతారని అనుకున్నారు. అయితే శాంతి భద్రతల నేపథ్యంలో వర్చువల్‌గా హాజరు అవుతారని ఆయన తరఫు న్యాయవాదులు కోర్టును అభ్యర్థించారు. వారి విజ్ఞప్తిపై



సానుకూలంగా స్పందించిన న్యాయస్థానం వర్చువల్ విధానంలో హాజరయ్యేందుకు అనుమతి ఇచ్చింది.

**కౌంటర్ దాఖలుకు పీపీ సమయం కోరడంతో..**

కౌంటర్ దాఖలకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమయం కోరగా.. తదుపరి విచారణను ఈ నెల 30కి నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. ఇదిలా ఉంటే సంధ్య థియేటర్ కేసులో ఇటీవల అల్లు అర్జున్‌ను నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు. అప్పుడే అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. అది శుక్రవారంతో ముగియనుండటంతో కోర్టు విచారణ జరిపింది.

## ఏం జరిగిందంటే?

**కాగా సంధ్య థియేటర్ ఘటనలో అల్లు అర్జున్‌ను పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. ఆపై నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు అల్లు అర్జున్‌కు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో అల్లు అర్జున్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. వెంటనే బెయిల్ విషయంలో హైకోర్టును ఆశ్రయించగా.. 4వారాల పాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. దీంతో బన్నీ చంచల్‌గూడ జైలు నుంచి ఆ రాత్రే బయటకొచ్చేసారని అంతా అనుకున్నారు. కానీ మధ్యంతర బెయిల్ మంజూరు కాపీ తమకు ఇంకా అందలేదని జైలు అధికారులు తెలిపారు. దీంతో ఆ రాత్రంతా బన్నీని జైలులోనే ఉంచారు. మరుసటి రోజు విడుదల చేశారు.**

# మచ్చలేని మహామనిషి మన్మోహన్ సింగ్

## ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంఛార్జి కంది శ్రీనివాస రెడ్డి





**ఆదిలాబాద్, మహా:** నిజాయితీకి, నిబద్ధతకు, నిరాడంబరతకు నిలువుటద్దం ఆర్థికవేత్త మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ అని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంఛార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయం ప్రజా సేవాభవన్ ఆవరణలో సంతాప సభను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున హాజరైన కాంగ్రెస్ శ్రేణులతో కలసి మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి అశ్రు నివాళి అర్పించారు. ఆయన మృతికి సంతాపంగా రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతున్ని ప్రార్థించారు. తన లాంటి ఎంతోమంది రైతు బిడ్డలు వ్యాపార వేత్తలుగా ఎదగడానికి కారణం ఆయన సంస్కరణలే అన్నారు. దేశం ఆర్థిక సంక్షోభంలో కొట్టు మిట్టాడుతున్న వేళ ఆర్థిక మంత్రిగా తన దైన శైలీలో పలు ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి దేశ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టిన మేధావి అని కొనియాడారు. దేశాన్ని లైసన్స్ రాజ్ నుండి సంస్కరణలవైపు మళ్లించిన గొప్ప నేత అన్నారు. ఆయన మరణం కాంగ్రెస్ పార్టీతోపాటు దేశానికి పూడ్చలేని లోటని పేర్కొన్నారు. ప్రొఫెసర్ గా, ఎకనామిస్ట్ గా, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ గా, ఆర్థిక శాఖా కార్యదర్శిగా, ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ గా, యూజీసీ చైర్మన్ గా, ఆర్థిక మంత్రిగా, దేశ ప్రధానిగా ఎనలేని సేవలందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి మన్మోహన్ సింగ్ అని గుర్తుచేశారు. దేశ జీడీపీ 3శాతంగా దేశం క్లిష్ట పరిస్థితిలో ఉన్నప్పుడు అనేక ఆర్థిక సంస్కరణలతో వృద్ధి రేటును పరుగులు పెట్టించిన ఆర్థిక మేధావి అన్నారు. దేశంలో ఎన్నో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన మహానుభావుడన్నారు. ఆయన మృతికి సంతాపగా ఏడు రోజులు సంతాపదినాలుగా పాటిద్దామన్నారు. అనంతరం సభలో పలువురు నేతలు దేశానికి ఆ మహనీయుడు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ దిగంబర్ రావు పటేల్, సయిాద్ ఖాన్, పట్టణ అధ్యక్షులు గుడిపల్లి నగేష్, నాయకులు గిమ్మ సంతోష్ రావు, మునిగేల నర్సింగ్, లోక ప్రవీణ్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, బండారి సతీష్, ఆవుల వెంకన్న, సంద నర్సింగ్, రామ్ కుమార్, భూమన్న, లక్ష్మణ్, షేక్ ఇమ్రాన్, జాఫర్ అహ్మద్, నాయకుడు ఎం. ఏ షకీల్, సహీద్ ఖాన్, పోరెడ్డి కిషన్, కొండూరి రవి, అల్చెట్టి నాగన్న, షేక్ మన్సూర్, పూసం ప్రభాకర్, ఎం. ఏ కయ్యుమ్, దుర్గం శేఖర్, బండారి చిన్నయ్య, సయ్యద్ సుజాత్ అలీ మహిళా నాయకురాలు గైదానే లత, శ్రీలేఖ ఆదివాసీ, నేరెళ్ల లక్ష్మి, ప్రేమల, శారద, గంగామణి, ఉమా మహేశ్వరి, షబానా బేగంతోపాటు భారీ సంఖ్యలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# కవితక్క కార్యక్రమంలో సీతక్క

**మహా:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొన్న ఓ కార్యక్రమంలో 'సీతక్క' పేరు వినిపించింది. ఓ బీసీ సంఘం నేత 'సీతక్క' పేరు పలకడంతో కవిత నవ్వేశారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఎమ్మెల్సీ కవిత బంజారాహిల్స్‌లోని తన నివాసంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 40 బీసీ సంఘాలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఒక్కో నేత మాట్లాడుతున్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఓ సిక్కు సంఘం నేత కూడా మాట్లాడారు. "సభ ఏర్పాటు చేసిన మా సీతక్కకు నమస్కారం" అంటూ ఆ సిక్కు సంఘం నేత ఒకింత తడబాటుకు గురయ్యారు. దీంతో కవిత సహా కార్యక్రమంలోని వారంతా నవ్వేశారు. ఆ వెంటనే పొరపాటును సరిదిద్దుకున్నారు. "సారీ కవితక్క" అంటూ తిరిగి ప్రసంగం కొనసాగించారు.

# రోజా పుత్రికోత్సాహం

**మహా:** మాజీ మంత్రి, నటి రోజా, దర్శక నిర్మాత సెల్వమణి దంపతుల కుమార్తె అన్షు మాలిక (20) అరుదైన ఘనతను సాధించింది. తాజాగా నైజీరియా లాగోస్‌లో జరిగిన గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఫెస్టివల్‌లో సోషల్ ఇంపాక్ట్ కేటగిరీలో అన్షు మాలిక గ్లోబల్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ అవార్డును సాధించింది. తన కూతురు తాజాగా సాధించిన ఘనతను రోజా తన ఎక్స్ ఖాతా వేదికగా తెలియజేస్తూ పుత్రికోత్సాహాన్ని వ్యక్తం చేశారు. అన్షు మాలిక్ కంటెంట్ క్రియేటర్‌గా, కంటెంట్ రైటర్‌గా, డెవలపర్‌గా, సామాజిక కార్యకర్తగా అనేక విభాగాల్లో గుర్తింపు పొందింది. 7ఏళ్ల వయసులోనే అనేక సాంకేతికతలను అలవాటు చేసుకున్న అన్షు ఆ వయసులోనే కోడింగ్ నేర్చుకుంది. తన 1617 ఏళ్ల మధ్య ఫేస్ రికగ్నిషన్ బాట్ యూసింగ్ డీప్ లర్నింగ్ అనే విభాగం గురించి ఏకంగా థీసిస్ రాసింది. ఆమె రాసిన ఈ థీసిస్ రీసెర్చ్ గురించి అంతర్జాతీయ మీడియా సైతం కథనాలు ప్రచురించింది. ఆమె తన 12వ




తరగతిలో 95శాతానికి సమానమైన 10 జి పిఏ తో కంప్యూటర్ సైన్స్‌ను అభ్యసించడానికి బ్లూమింగ్టన్‌లోని ఇండియానా విశ్వవిద్యాలయంలో చేరింది. గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఫెస్టివల్ అభ్యర్థులను ఆవిష్కరణ, ప్రభావం, స్థిరత్వం, వారి చొరవ స్కేలబిలిటీ వంటి వివిధ పారామితులపై అంచనా వేస్తుంది. తన కూతురు తాజాగా సాధించిన ఘనతను రోజా తన ఎక్స్ ఖాతా వేదికగా తెలియజేసింది.

బ్రిడ్జిపై నుంచి కాల్వలోకి

# పడిపోయిన బస్సు

## 8 మంది మృతి.. 18 మందికి తీవ్ర గాయాలు



**పంజాబ్:** పంజాబ్ రాష్ట్రంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 8 మంది దుర్మరణం చెందారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. బఠిండాలో శుక్రవారం ప్రయాణికులతో వెళ్తున్న బస్సు రోడ్డు ప్రమాదానికి గురై కాల్వలో పడిపోయింది. జీవన్ సింగ్ వాలా గ్రామ సమీపంలో అదుపు తప్పి వంతెన రెయిలింగ్ ను ఢీకొట్టింది, అనంతరం కాల్వలో పడిపోయింది. ఈ ఘటనలో 8 మంది మృతి చెందారు. 18 మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే సహాయక చర్యలను చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. 50 మంది ప్రయాణికులతో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు.



# మేఘాకు సుప్రీంకోర్టు బిగ్ షాక్

## ఆ వివరాలు ఇవ్వాలని ఆదేశాలు

### పాలమూరు అంచనాలు పెంచిన గత ప్రభుత్వం

### ప్రభుత్వ ఖజానాకు రూ. 2,426.07 కోట్ల భారీ నష్టం

### సుప్రీం కోర్టులో వాదనలు.. విచారణ ఫిబ్రవరి 10కి వాయిదా


**ఢిల్లీ, మహా:** మేఘా ఇంజనీరింగ్ సంస్థకు సుప్రీంకోర్టు బిగ్ షాక్ ఇచ్చింది. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్ట్ లో అవకతవకలపై విచారణ చేసిన న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వంతో పాటు, మేఘా ఇంజినీరింగ్ సంస్థ, బీహెచ్ఈఎల్ కు నోటీసులు జారీ చేసింది. ప్రాజెక్టుకు సంబంధించి ఒరిజినల్ ఫైల్స్ ను తమ ముందు ఉంచాలని నోటీసుల్లో పేర్కొంది. బీహెచ్ఈఎల్ తాను తయారు చేసి సప్లై చేసిన పరికరాలు, పొందిన బిల్లులకు సంబంధించిన వివరాలతో అఫిడవిట్ ను కూడా అందించాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

**మేఘా కోసమే అంచనాల పెంపు**

నాగం జనార్దన్ రెడ్డి తరపున ప్రశాంత్ భూషణ్ తన వాదనలు వినిపిస్తూ.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు మొదటగా ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా రూ.5,960తో అంచనాలు తయారు చేసిందన్నారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం మరో సలహాదారుడిని తీసుకువచ్చిందని న్యాయస్థానానికి వివరించారు. ప్రభుత్వం కావాలనే మూడు రోజుల్లోనే రూ.8,386 కోట్లతో మరో అంచనా రూపొందేలా చేసిందని ఆయన వివరించారు. అ అంచనాలను నిబంధనలకు విరుద్ధంగా సవరించారన్నారు. సరైన విధానాలను అనుసరించకుండా చేసిన ఈ సవరణ ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ. 2,426.07 కోట్ల భారీ నష్టం వాటిల్లిందన్నారు. పరికరాల అంచనాలకు సంబంధించి ప్రభుత్వం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కోటేషన్లు కోరాల్సిన అవసరం ఉందన్నారు. మేఘా, బిహెచ్ ఈఎల్ మధ్య ఒప్పందంలోనూ లోపాలు ఉన్నాయన్నారు. ఆ రెండు సంస్థలు చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం.. 65% ఎలక్ట్రికల్‌మెకానికల్ పనులు నిర్వహించే బిహెచ్ ఈఎల్ కు 20% మొత్తం, మిగతా 35% సివిల్ పనులు నిర్వహించే మేఘా సంస్థకు 80% సొమ్మును ఇవ్వనున్నట్లు పేర్కొన్నారని నాగం తరపు లాయర్ వాదనలు వినిపించారు. భెల్ సంస్థ పరికరాలను మాత్రమే సరఫరా చేస్తుందని.. ఆ పరికరాల ఏర్పాటుతో పాటు మెయింటెనెన్స్ పూర్తిగా మేఘా సంస్థే చూసుకుంటుందని వాదనలు వినిపించడంతో ఈ పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసిందన్నారు. ప్యాకేజీ 5కు సంబంధించి 9 మోటార్లు, పంపుల ధర రూ.1,611 కోట్లుగా ఉందన్నారు. అయితే భెల్ సంస్థ ఇంతగా ఖర్చు చేస్తున్నా వారికి కాంట్రాక్టు కింద రూ.803 కోట్లు మాత్రమే ఎందుకు నిర్దేశించారనే అంశంపై ప్రశ్నలు లేవనెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి మోటార్లు, పంపుల ధరలను 4 నుంచి 5 రెట్లు పెంచినట్లు కాగ్ చెప్పిందని తెలిపారు. ఇక్కడ కూడా అదే పద్దతిని ఫాలో అయ్యారని ఆయన పేర్కొన్నారు. భెల్ సప్లై చేసే మోటార్లు, పంపుల ఖర్చు 65 శాతం ఉన్నా.. వారికి 20 శాతం మొత్తం ఇచ్చేలా ఒప్పందం చేసుకోవడం విచిత్రంగా లేదా? అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా వ్యాఖ్యానించారు. 8 మోటార్లు, పంపుల్లో భెల్ అందించే పరికరాల వాటా ఎంత? అని న్యాయమూర్తులు ప్రశ్నించారు. ఆ వివరాలు చెప్పడానికి మేఘా, బీహెచ్ఈఎల్ ప్రతినిధులు సమయం తీసుకున్నారు.









# మన్మోహనా నీ ముద్ర పదిలం..

**ఢిల్లీ, మహా:** మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ అంత్యక్రియలను కేంద్ర ప్రభుత్వం శనివారం అధికారిక లాంఛనాలతో రాజ్‌ఘాట్ సమీపంలో నిర్వహించనుంది. అంతిమ యాత్ర ఉదయం 9.30 గంటలకు ఏఐసీసీ ప్రధాన కార్యాలయం నుంచి ప్రారంభమౌతుందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. "ప్రస్తుతం మన్మోహన్ సింగ్ పార్థివ దేహం మోతీలాల్ నెహ్రూ రోడ్డులోని ఆయన నివాసంలో ఉంది. రేపటి ఉదయం వరకు ప్రజలు అక్కడి వచ్చి నివాళులు అర్పించవచ్చు. డిసెంబర్ 28న అంటే శనివారం ఉదయం 8 గంటలకు ఆయన భౌతిక కాయాన్ని ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తీసుకెళ్తాం. అక్కడ ఉదయం 8.30 నుంచి 9.30 మధ్య ప్రజలు, పార్టీ కార్యకర్తలు నివాళులు అర్పించేందుకు అవకాశం ఇస్తాం. 9.30 గంటల తరువాత అక్కడి నుంచి శ్మశాన వాటికకు మన్మోహన్ సింగ్ అంతిమ యాత్ర మొదలవుతుంది" అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు.

### ఘన నివాళులు

అనారోగ్య సమస్యలతో దిల్లీ ఎయిమ్స్‌లో గురువారం రాత్రి తుదిశ్వాస విడిచిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పార్థివదేహాన్ని ఆయన నివాసానికి తరలించారు. ఈ ఉదయం పలువురు ప్రముఖులు మన్మోహన్ నివాసానికి చేరుకొని ఆయన భౌతిక కాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖులు మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళులు అర్పించారు.

### చంద్రబాబు నివాళులు

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి నివాళులు అర్పించారు. చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ ఎంపీలు కేశినేని చిన్ని, డాక్టర్ బైరెడ్డి శబరి కూడా మన్మోహన్ సింగ్‌కు నివాళులు అర్పించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ, దేశం గొప్ప ఆర్థిక సంస్కర్తను కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. దేశానికి మన్మోహన్ అవిశ్రాంతంగా సేవలందించారని, ఆయన మరణం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు.

### కాంగ్రెస్ పుష్పాంజలి

కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ, ఆ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ సహా పలువురు పార్టీ నేతలు మన్మోహన్ సింగ్ భౌతికఖాయం వద్ద పుష్పాంజలి ఘటించారు. మన్మోహన్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా పలువురు కేంద్రమంత్రులు, వివిధ రాజకీయపార్టీల ముఖ్యనేతలు, ముఖ్యమంత్రులు కూడా మన్మోహన్ నివాసానికి చేరుకొని ఆయన భౌతికకాయం వద్ద అంజలి ఘటించారు. భారత సైన్యం తరపున సైనికాధికారులు మాజీ ప్రధానికి నివాళి అర్పించారు. మన్మోహన్ పార్థివదేహాన్ని ఉంచిన పేటికపై జాతీయ జెండా ఉంచి సెల్యూట్ చేశారు.

### బెళగావ్ నుండి ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి

మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ పార్థివ దేహాన్ని సందర్శించి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నివాళులు అర్పించారు. భేల్గావ్ నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుక్కు, ఏఐసీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, సిడబ్ల్యుసి సభ్యులు మంత్రి దామోదర్ రాజా నర్సింహ, ఎంపీలు మల్లు రవి, అనిల్ కుమార్ యాదవ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ తదితరులు వెళ్ళారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు.

### ఉపాధి హామీ పథకం మన్మోహన్ ఘనతే!

చారిత్రక చట్టాల రూపశిల్పి మన్మోహన్ సింగ్. మన్మోహన్ సింగ్ పదేళ్ల పాలనలో నాటి యూపీఏ ప్రభుత్వం పలు ముఖ్య చట్టాలు చేసింది. అందులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒకటి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీలకు ఉపాధి కల్పించడం కోసం ఈ పథకానికి రూపకల్పన చేశారు. 2004లో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. వంద రోజుల పాటు వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించింది. సోనియా గాంధీ నేతృత్వంలోని జాతీయ సలహా మండలిలో ఈ పథకం రూపుదిద్దుకుంది. దీంతో పాటు సమాచార హక్కును యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చింది. రైట్ టు ఇన్ఫర్మేషన్, రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ లను 2005లో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ అమలులోకి తెచ్చారు. విద్యారంగంలోనూ మన్మోహన్ కీలక సంస్కరణలు అమలు చేశారు. ఎడ్యుకేషన్ లో ఓబీసీ రిజర్వేషన్ అమలు చేసింది మన్మోహన్ సింగ్ ప్రభుత్వమే. 2009 లో లోక్ సభ ఎన్నికల వేళ మెగా ఫార్మ్ లోన్ ప్యాకేజీ ప్రకటించారు. అంతకుముందు ఆహార భద్రత చట్టం (ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్) ను మన్మోహన్ నేతృత్వంలోని యూపీఏ సర్కారు అమలులోకి తెచ్చింది.

## దేశాన్ని గట్టెక్కించిన మన్మోహన్


భారతదేశాన్ని ఆర్థికకష్టాల్లోంచి గట్టెక్కించిన దార్శనికుడు మన్మోహన్ సింగ్. పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో ఉన్న భారత దేశాన్ని గట్టెక్కించిన 1991 కేంద్ర బడ్జెట్‌ను ఒక ల్యాండ్ మార్క్ పద్దుగా పరిగణిస్తారు. దేశ ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మన్మోహన్ సింగ్ ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ ఇదే కావడం గమనార్హం. వాస్తవానికి ఈ బడ్జెట్ ప్రవేశపెట్టేటప్పుడు సొంత పార్టీ నుంచే మన్మోహన్ సింగ్ తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొన్నారు. అయినప్పటికీ ఏ మాత్రం తొణకకుండా, తానొక్కరే ఏటికి ఎదురీది దేశాన్ని ఒడ్డునపడేశారు.

### 1991 బడ్జెట్ గేమ్ ఛేంజర్

దేశంలో ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్ సింగ్ 1991లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఆధునిక భారత్‌ను మేలిమలుపు తిప్పింది. ఈ బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు సొంత పార్టీ నుంచి కూడా మన్మోహన్‌కు తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ముఖ్యంగా ఎరువులు, పెట్రోల్, ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధరలను పెంచడం చాలా మంది ఎంపీలకు మింగుడు పడలేదు. కానీ మన్మోహన్ మాత్రం ఆ వ్యతిరేకతను చాలా కూల్‌గా ఎదుర్కొన్నారు. ప్రధానిగా పీవీ నరసింహారావు బాధ్యతలు చేపట్టగానే, ఆర్థికమంత్రిగా మన్మోహన్ సింగ్‌ను ఎంపిక చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. 1991 జులై 24న మన్మోహన్ ఈ ల్యాండ్‌మార్క్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆ ఆర్థిక సంస్కరణలే దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించాయి. బడ్జెట్ తర్వాత జర్నలిస్ట్‌లు అడిగిన ప్రశ్నలను కాంగ్రెస్ నేతలు ఎదుర్కోలేకపోయారు. బడ్జెట్ తర్వాత ఎటువంటి షెడ్యూల్ లేకుండానే మన్మోహన్ ప్రెస్‌కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్ రాసిన 'టు ది బ్రింక్ అండ్ బ్యాక్: ఇండియా'స్ 1991 స్టోరీ'లో వెల్లడించారు. ఆ విలేకర్ల సమావేశంలో తన బడ్జెట్‌లోని అంశాలను మన్మోహన్ స్పష్టంగా వివరించారు. దానిని బడ్జెట్ విత్ హ్యూమన్ ఫేస్‌గా అభివర్ణించారు. తీవ్ర విమర్శల మధ్య కూడా ఎరువులు, పెట్రోల్, ఎల్‌పీజీ ధరల పెంపును సమర్థించారు. మరోవైపు సొంత పార్టీ నేతల్లో వచ్చిన అసంతృప్తిని నాటి ప్రధాని పీవీ నరసింహారావు గమనించి, ఆగస్టు 1న కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం ఏర్పాటుచేశారు. ఎంపీలు తమ ఆగ్రహం, అసంతృప్తిని బహిరంగంగా వెళ్లగక్కేందుకు అవకాశం ఇచ్చారు. వాటిని మన్మోహన్ నేరుగా ఎదుర్కొని సమాధానం చెప్పేలా నరసింహారావు మౌనంగా ఉన్నారు. ఈ సమావేశం 1991 ఆగస్టు 2, 3 తేదీల్లో సుదీర్ఘంగా కొనసాగింది. మన్మోహన్ సింగ్‌కు కేవలం మణిశంకర్ అయ్యర్, నాథూరామ్ మిర్ధా నుంచి మాత్రమే మద్దతు లభించింది. సభ్యులను శాంతపర్చేందుకు నాడు మన్మోహన్ ఎరువుల ధరలను స్వల్పంగా తగ్గించారు. ఎల్‌పీజీ, పెట్రోల్ ధరల్లో మాత్రం ఆయన రాజీ పడలేదు.

### దేశాన్ని సంక్షోభాలు దాటించిన జోడి పీవీ-మన్మోహన్

పార్టీ సమావేశాలు ముగియగానే 1991 ఆగస్టు 4, 5 తేదీల్లో రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశాలు జరిగాయి. లోక్‌సభలో ఆగస్టు 6న ఆర్థిక మంత్రి చేయాల్సిన ప్రకటనపై ఇందులో చర్చించారు. చివరికి బడ్జెట్ ప్రతిపాదనలను వెనక్కి తీసుకొనే డిమాండ్లను కొట్టిపారేసి, చిన్నరైతుల ప్రయోజనాలు కాపాడటానికి కట్టుబడినట్లు పేర్కొన్నారు. మొత్తం మీద అన్ని పక్షాలను శాంతపరుస్తూనే, ఎరువుల ధరలపై నియంత్రణ తొలగింపును మన్మోహన్ కొనసాగించగలిగారు. వాస్తవానికి బడ్జెట్ ప్రవేశపెట్టాల్సిన జులై నాటికి భారత విదేశీ మారకద్రవ్యం పూర్తిగా అడుగంటింది. దీంతో ఆ నెల ఆర్‌బీఐ తన వద్ద ఉన్న 41 టన్నుల బంగారాన్ని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వద్ద కుదువపెట్టి విదేశీ మారక ద్రవ్యాన్ని తెచ్చుకొంది. ఇది కూడా కొన్నాళ్లు మాత్రమే దేశ అవసరాలు తీర్చగలదు.



### రాజ్యసభలో మహిళా బిల్లు

తన ప్రభుత్వానికి పూర్తిస్థాయి మెజార్టీ లేకున్నా రాజ్యసభలో మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోద ముద్ర వేయించారు. అత్యంత వ్యూహాత్మకంగా తెలంగాణ బిల్లునూ ఉభయసభల్లో గట్టెక్కించారు. ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం ఆయన హయాంలోనే రూపుదిద్దుకొంది. ఢిల్లీకి మరోవైపు జేవర్ ఎయిర్‌పోర్టుకూ భూసేకరణ చేపట్టి పునాదులు వేశారు. దేశ రాజధానితోపాటు చాలా నగరాల్లో మెట్రో రైలు విస్తరించారు. మన్మోహన్ హయాంలోనే ప్రతిభాపాటిల్ రాష్ట్రపతి పీఠమెక్కారు. తొలిసారి ఒక మహిళను దేశ అత్యున్నత స్థానంలో కూర్చోబెట్టిన ఘన కీర్తి ఆయన సర్కారుదే. మన్మోహన్ హయాంలోనే సేల్స్ ట్యాక్స్ స్థానంలో వ్యాట్ ప్రవేశపెట్టారు. జీఎస్‌టీ విధానాన్ని తెరమీదకు తీసుకొచ్చి రాష్ట్రాల మధ్య సమన్వయ సాధనకు చర్యలు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య ఆరోగ్యసేవలకు సంబంధించిన మౌలిక వసతులు పెంపొందించడానికి నేషనల్ రూరల్ హెల్త్ మిషన్‌ను ప్రారంభించింది. పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపరచడానికి జవహర్‌లాల్ నెహ్రూ అర్బన్ రెన్యూవల్ మిషన్‌ను ప్రారంభించి ఏడేళ్లలో 20 బిలియన్ డాలర్లు ఖర్చు చేశారు.

## తెలంగాణ ఏర్పాటుతో పాటు ప్రతీ పరిణామంలో మన్మోహన్

**దేశానికి సరికొత్త దశ, దిశ చూపిన అరుదైన నేత**

**ఎన్నో విజయాలు.. మరెన్నో సంచలనాలు**

మన్మోహన్ సింగ్ ఆలోచనలు అమోఘం. దేశానికి సరికొత్త దశ, దిశ చూపిన ప్రధానమంత్రిగా చరిత్ర ఆయన్ను గుర్తుంచుకుంటుంది. ఎక్కడా పెద్దగా మాట్లాడకుండానే 2004 నుంచి 2014 వరకు దేశాన్ని సమర్థంగా ముందుకు నడిపించారు. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పాటు, ఉపాధి హామీ పథకం ప్రారంభం వంటి ఎన్నో కీలక పరిణామాలు ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే చోటుచేసుకున్నాయి. సంస్కరణ వాదిగానే కాకుండా పరిపాలన దక్షుడుగా ఎన్నో చరిత్రాత్మక పథకాలకు మన్మోహన్ శ్రీకారం చుట్టారు. మన్మోహన్ సింగ్ పాలనాకాలంలోనే దేశంలో 3జీ, 4జీ సేవల ప్రారంభంతో మొబైల్ సాంకేతిక విప్లవం ఊపందుకుంది. ఆధార్ కార్డుల జారీ మొదలైందీ ఆయన హయాంలోనే. మన్మోహన్ సర్కారు గ్రామీణ పేదలకు ఏడాదికి 100 రోజుల పనికి గ్యారెంటీ కల్పిస్తూ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చింది. వివిధ పథకాల కింద నగదు సాయాన్ని ఆధార్ అనుసంధానమైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా బదిలీ చేసే ప్రక్రియను ప్రారంభించింది. ప్రైవేటు పాఠశాలల్లోనూ కొందరు పేద విద్యార్థులు ఉచితంగా చదువుకునేలా నిబంధనలు రూపొందించింది. సామాన్యుడి చేతికి పాశుపతాస్త్రంలాంటి సమాచార హక్కును అందించింది.

### రుణమాఫీ సాహసం

దేశంలో 3 కోట్ల మంది చిన్న, సన్నకారు రైతులకు రూ.72 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత మన్మోహన్ ప్రభుత్వానికి దక్కుతుంది. రుణమాఫీపై ఆయన సర్కారు తీసుకున్న సాహసోపేత నిర్ణయం కారణంగానే 2009లో యూపీయే వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చింది. ఆ స్ఫూర్తితోనే చాలా రాష్ట్ర ప్రభుత్వాలు రైతు రుణమాఫీ హామీతో ఎన్నికలకు వెళ్లి గెలిచాయి. మన్మోహన్ హయాంలోనే విదర్భ, బుందేల్‌ఖండ్ ప్రాంతాల్లో రైతు ఆత్మహత్యల నివారణ కోసం ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించారు. భూసేకరణ చట్టాన్ని ఆధునీకీకరించి ప్రభుత్వ పథకాలు, మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయే బాధితులకు అధిక పరిహారం, పునరావాసం అందించేలా మన్మోహన్ చర్యలు తీసుకున్నారు. ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ ఆయన హయాంలోనే అవతరించింది. తన మైనార్టీ ప్రభుత్వానికి వామపక్షాలు మద్దతు ఉపసంహరించుకొని హెచ్చరికలు జారీ చేసినా వెరవకుండా అమెరికాతో అణు ఒప్పందం చేసుకున్న ధైర్యశాలి మన్మోహన్. పార్టీ అధినాయకురాలిగా సోనియాగాంధీ బలంగా ఉన్నా, నేతలంతా ఆమె కనుసన్నల్లోనే నడుచుకున్నప్పటికీ ఎక్కడా తన మాటకు విలువ తగ్గకుండా, దేశ గౌరవాన్ని తగ్గించకుండా చాకచక్యంగా ప్రధానమంత్రి పదవీ బాధ్యతలను నిర్వర్తించారు మన్మోహన్.

### మచ్చలేని నాయకుడు

ప్రధానిగా మన్మోహన్ పదేళ్ల పదవీకాలంలో ఎన్నో సంక్షోభాలు తలెత్తాయి. ఆయన సర్కారుపై విమర్శలు, కుంభకోణాల ఆరోపణలు వెల్లువెత్తాయి. 2జీ, బొగ్గు, కామన్‌వెల్త్, ఆదర్శ్ వంటి కుంభకోణాలు ప్రభుత్వాన్ని అతలాకుతలం చేసినా ఎవ్వరూ మన్మోహన్‌పై నేరుగా ఎవరూ వేలెత్తి చూపలేదు. 2008 నాటి ముంబయి ఉగ్రదాడి, 2012లో దిల్లీలో జరిగిన నిర్భయ ఘటన, అన్నా హజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమం దేశాన్ని ఊపేశాయి. అయినా ఎవరూ మన్మోహన్‌కు నిందల్ని ఆపాదించే సాహసం చేయలేదంటే మన్మోహన్ పనితీరుకు నిదర్శనం.

### రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp- 7436939999

### పోరు కన్నా ఊరు మిన్న..

# మన ఊరికి తిరిగిరండి

**ఎస్పీ డాక్టర్ శబరీష్.. మావోయిస్టు నేత దామోదర్ తల్లిని కలిసిన ఎస్పీ**



**ములుగు, మహా:** పోరుబాట కన్నా ఉన్న ఊరు మిన్న అని, ఊరికి తిరిగి వచ్చి కుటుంబ సభ్యులతో కలిసి జీవించాలని మావోయిస్టులకు జిల్లా ఎస్పీ డాక్టర్ పి.శబరీష్ పిలుపు నిచ్చారు. శుక్రవారం డీజీపీ ఉత్తర్వుల మేరకు తాడ్వాయి మండలం కాల్వపల్లి లో సీపీఐ మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు బడే చొక్కారావు అలియాస్ దామోదర్ తల్లి బడే బతుకమ్మ, గోవిందరావుపేట మండలం మొద్దులగూడెం గ్రామానికి చెందిన భద్రాద్రి కొత్తగూడెం అల్లూరి సీతారామరాజు జిల్లా డివిజన్ కార్యదర్శిగా పనిచేస్తున్న కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ భార్య సుజాతలను కలిసిన జిల్లా ఎస్పీ ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకున్నారు. దామోదర్, ఆజాద్ లను తిరిగి జనజీవన స్రవంతిలో కలవాలని కుటుంబ సభ్యుల ద్వారా పిలుపునిచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీకి ఆదరణ తగ్గుతోందని, ఇప్పటికైనా పార్టీని వదిలి సరెండర్ అయ్యి కుటుంబంతో గడపాలని ఆజాద్ భార్య సుజాత కోరినట్లు వివరించారు. బడే చొక్కారావ్ తల్లి బతుకమ్మ మాట్లాడుతూ తన ఆరోగ్యం బాగాలేదని, వుండడానికి ఇల్లు కూడా లేదని, తనను చివరి క్షణాల్లో చూసుకోవాలని, సరెండర్ అయ్యి నాతో కలిసి జీవించాలని అని చెప్పినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం తరపున పునరావాసం కల్పిస్తామని ఎస్పీ శబరీష్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మావోయిస్టు కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు డీఎస్పీ ఎన్. రవీందర్, పస్రా సీఐ జి. రవీందర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, పస్రా ఎస్సై కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

### ఇబ్రహీంపట్నంలో మాజీ ప్రధానికి

# ఘన నివాళులు



- దేశ ప్రధానిగా చేసిన సేవలు మరువలేనివి
- ఆర్థికవేత్తగా దేశ పురోగతిని మార్చిన నాయకుడు
- భవిష్యత్ తరాలకు బాటలు వేసిన గొప్ప నేత
- కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసిన ఘనుడు
- రాష్ట్ర నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 27, మహా:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... దూరదృష్టి గల నాయకుడు, ప్రఖ్యాత ఆర్థికవేత్త, రాజనీతిజ్ఞుడు, భారతదేశ పురోగతిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని పేర్కొన్నారు. దేశానికి మన్మోహన్ సింగ్ చేసిన కృషి, దేశ అభివృద్ధిలో ఆయన పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు. మన్మోహన్ సింగ్ మరణంతో కాంగ్రెస్ పార్టీ ఒక సుశిక్షితుడైన సైనికుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నిర్ణయమే తన నిర్ణయంగా శిరసావహించిన మన్మోహన్ సింగ్, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. సంక్షేమ పథకాలను ప్రజలకు హక్కుగా కల్పించిన ఘనత మన్మోహన్ సింగ్ కి దక్కుతుందన్నారు. విద్యా హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం, ఆహార భద్రత చట్టం, ఉపాధి హామీ చట్టం వంటి ఎన్నో చట్టాలు ప్రధాని మన్మోహన్ సింగ్ కాలంలోనే అమల్లోకి వచ్చాయని గుర్తుచేశారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. మన్మోహన్ సింగ్ చిత్తశుద్ధి, ప్రజాసేవ పట్ల అంకితభావం మనందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. ఈ విషాద తరుణంలో ఆయన కుటుంబ సభ్యులకు, ఆత్మీయులకు కాంగ్రెస్ పార్టీ శ్రేణు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ కప్పరి స్రవంతి మార్కెట్ కమిటీ చైర్మన్ లు కంబాలపల్లి గురునాథరెడ్డి, చిలుక మధుసూదన్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పాండురంగ రెడ్డి, కౌన్సిలర్ నీళ్ల భాను గౌడ్, మాజీ జడ్పిటిసి భూపతిగల్లా మహిపాల్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఈసీ శేఖర్ మామ, ముత్యాల రాజశేఖర్ రావు, మంకాల శేఖర్ రెడ్డి, భరత్ కుమార్ రెడ్డి, ఆకుల ఆనంద్, రాఘవేందర్, జమాల్పూర్ శ్యామ్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### సేవాదళ్ యూత్ వింగ్ జిల్లా అధ్యక్షులుగా సాయితేజ



**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 27, మహా:** కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ యువజన విభాగం జిల్లా అధ్యక్షులుగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రానికి చెందిన మడుపు సాయితేజ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు తెల్ల శ్రావణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డిలు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాయి తేజ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా నడుచుకుంటానని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికి అందేవిధంగా చూస్తానని చెప్పారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. తనను జిల్లా అధ్యక్షుడిగా నియమించిన స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, యువ నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి, పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రాణం తీసిన రెండు కుటుంబాల భూ వివాదం



**కాటారం, మహా:** రెండు కుటుంబాల భూ తగాదాల మధ్య జరిగిన గొడవలు ఒకరి ప్రాణంతీశాయి. భూపాలపల్లి జిల్లా కాటారం మండలకేంద్రంలోని ఇప్పల గూడెంకు చెందిన డోంగిరి బుచ్చయ్య (55) అనే వ్యక్తికి అదే గ్రామానికి చెందిన సోదారి లింగయ్య అనే వ్యక్తి కుటుంబంతో గత కొన్ని ఏండ్లుగా భూవివాదం కొనసాగుతుంది. రెండు కుటుంబాల మధ్య ఉన్న భూవివాదంతో శుక్రవారం ఒకరు ప్రాణాలు కోల్పోగా, మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కాటారం మండల కేంద్రంలోని ఇప్పల గూడెంకు చెందిన డోంగిరి బుచ్చయ్య శుక్రవారం ఉదయం వివాదంగా ఉన్న సోదారి లింగయ్య భూమి దగ్గరికి వెళ్లారు. ఈ క్రమంలో లింగయ్య, భార్య పద్మ, బుచ్చయ్య మొదట ఇద్దరు గొడవపడ్డారు. దీంతో బుచ్చయ్య ఆవేశంతో లింగయ్య భార్య పద్మను పారతో కొట్టడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయాన్ని సోదారి లింగయ్య తన కుమారుడు సోదారి పవన్ కు చెప్పాడు. తల్లి గాయపడిన విషయాన్ని తెలుసుకున్న పవన్ ఆవేశంతో ఇంటికి వస్తున్న క్రమంలో మార్గమధ్యంలో కాటారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని పశువుల ఆసుపత్రి ముందు దొంగిరి బుచ్చయ్య కనబడ్డాడు. వెంటనే పవన్ అక్కడే ఉన్న కర్ర తీసుకుని బుచ్చయ్య తలపై బలంగా బాదడంతో అతను కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

# పేదల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ

- జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్
- జీవంతరావుపల్లిలో ఫ్రీ మెడికల్ క్యాంప్ ప్రారంభం



**ములుగు, మహా:** రాష్ట్రంలో పేదలకు మెరుగైన ఆరోగ్యం అందించే లక్ష్యంతో పనిచేస్తున్నామని, అందులో భాగంగా ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ అన్నారు. శుక్రవారం ములుగు మండలం జీవంతరావుపల్లిలో యూఎస్టీ, నిర్మాణ్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని రవిచందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రవిచందర్ మాట్లాడుతూ మంత్రి సీతక్క చొరవతో జీవంతరావుపల్లి, జగ్గన్నగూడెం గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారని, ఉచిత పరీక్షల అనంతరం తగిన మందులు అందిస్తున్నట్లు తెలిపారు. పేదల ఆరోగ్యం పట్ల ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు వెల్లడించారు. వైద్య శిబిరాలతో పేద ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి అంగోత్ వంవీ క్రిష్ణ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### క్రీడల పట్ల యువత ఆసక్తి కనబరచాలి

**కాంగ్రెస్ నేత శ్రీనివాస్**



**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 27, మహా:** మాల్ గ్రామంలోని యూత్ అసోసియేషన్ కమిటీ సభ్యులకు శుక్రవారం వాలీబాల్ కిట్లను యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల పట్ల యువత ఆసక్తి కనబరచాలన్నారు. క్రీడల పట్ల ఉత్సాహం చూపించాలని, క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాల్లో పాల్గొనాలని ఆయన యువతను కోరారు. ఈ కార్యక్రమంలో చిన్నోళ్ల శ్రీకాంత్, చిన్నోళ్ల వినయ్, చిన్నోళ్ల కిరణ్, మించ నందు, గుడుగుంట్ల శివ, చౌదర్ పల్లి రాకేష్, గుడుగుంట్ల చందు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

### టీఎస్‌పీటీఏ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కంది శ్రీనివాసరెడ్డి




**ఆదిలాబాద్, మహా:** తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్‌కు సంబంధించి 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆవిష్కరించారు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రజా సేవా భవన్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఆయన క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాసరెడ్డి అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ పీటీఏ జిల్లా



అధ్యక్షులు మొహమ్మద్ రియాజ్, జనరల్ సెక్రెటరీ కాంతం, ఉపాధ్యాయులు చరణ్ సింగ్, అఫ్రోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుల టోకెన్ సమ్మె

**ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్**




ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 27, మహా: ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుగ్గరాములు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తవుతున్నా కార్మికుల సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 27, 28 తేదీలలో టోకెన్ సమ్మె పిలుపులో భాగంగా శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఎమ్మార్వో ఆఫీస్ వద్ద టోకెన్ సమ్మె నిర్వహించారు. ఈ సమ్మె సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుగ్గరాములు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేసి కనీస వేతనాలు అమలు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే కార్మికుల వేతనాలకు ప్రత్యేక గ్రాంట్ కేటాయించి పీఆర్సీలో అర్హులుగా గుర్తించాలని కోరారు. రూ. 5 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలన్నారు. కనీస వేతనం రూ. 19 వేలు అమలు చేసి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలన్నారు. జీవో 51ని సవరించి మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ప్రమాదం జరిగి మరణించిన సిబ్బంది కుటుంబానికి రూ. 10 లక్షల నష్టపరిహారం ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన విధంగా పర్మిట్ చేసి కనీస వేతనాలు చెల్లిస్తామన్న హామీని అమలు చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కారోబార్లు దేవదాస్, ఐలయ్య, మల్లేష్, సిబ్బంది నరేష్, బాలరాజ్, కిషన్, అశోక్, అనిత, రాణమ్మ, పార్వతమ్మ, అండాలు, స్వామి, అబ్బయ్య, మల్లేష్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

### మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గొప్ప ఆర్థికవేత్త

**గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్**

**ములుగులో మన్మోహన్ కు ఘన నివాళులు**




**ములుగు, మహా :** భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గొప్ప ఆర్థికవేత్త అని, ఆయన తీసుకువచ్చిన సంస్కరణలో పేదలకు ఎంతో ఉపయోపడ్డాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ అన్నారు. ఆయన ఢిల్లీలో అనారోగ్యంతో మృతిచెందగా ములుగులోని గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ.చాంద్ పాషా ఆధ్వర్యంలో శుక్రవారం మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవిచందర్ మాట్లాడుతూ.. మాజీ ప్రధాని పీవీ హయాంలో ఆర్థిక వేత్తగా ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన ఘనత మన్మోహన్ సింగ్ కు దక్కుతుందన్నారు. పదేళ్ల పాటు ప్రధానిగా కొనసాగిన ఆయన పలువురు రాజకీయవేత్తలకు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుమన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### అయ్యప్ప పూజలో వెల్లివిరిసిన

# మతసామరస్యం

**స్వాములకు భిక్ష వడ్డించిన అర్జుమంద్ అలీ**

**నిర్మల్, మహా:** అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములకు అన్నదానం చేసి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ మత సామరస్యాన్ని చాటుకున్నారు. నిర్మల్ జిల్లా సోన్ మండలం కడ్తాల్ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో మండల పూజ మహోత్సవం సందర్భంగా ఆయన అయ్యప్ప స్వాములకు శుక్రవారం అన్నదానం చేశారు. దగ్గరుండి స్వాములకు భోజనాన్ని వడ్డించారు. మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటే అనే భావనతో అన్నదానం చేసినట్లు తెలిపారు. అంతకుముందు గురుస్వామి నర్సారెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు చక్రవర్తుల తేజ ఆచార్యులు గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, అయ్యప్ప స్వామి, ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకాలతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలశ పూజ, పుష్పార్చన, మెట్ల పూజ తదితర కార్యక్రమాలు చేపట్టి పదునెట్టంబడి వెలిగించారు. ఈ పూజా కార్యక్రమానికి నిర్మల్ జిల్లా నుండి కాకుండా చుట్టుపక్క నిజామాబాద్, జగిత్యాల, మహారాష్ట్ర నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, నాయకులు జునైద్ మెమన్, మతిన్, చిన్ను, భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్, మహా: అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములకు అన్నదానం చేసి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ మత సామరస్యాన్ని చాటుకున్నారు. నిర్మల్ జిల్లా సోన్ మండలం కడ్తాల్ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో మండల పూజ మహోత్సవం సందర్భంగా ఆయన అయ్యప్ప స్వాములకు శుక్రవారం అన్నదానం చేశారు. దగ్గరుండి స్వాములకు భోజనాన్ని వడ్డించారు. మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటే అనే భావనతో అన్నదానం చేసినట్లు తెలిపారు.

### సామాజిక సేవకు ఎల్లప్పుడు సిద్ధం : కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్, మహా:** సామాజిక హితం కోసం చేపట్టే కార్యక్రమాలకు తన సహాయ సహకారాలు ఉంటాయని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్‌లో జమియత్ ఉల్మా హింద్ నూతన కార్యాలయం ప్రారంభానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జమియత్ ఉల్మా హింద్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమూద్ జుబేర్‌తో పాటు పట్టణ అధ్యక్షులు అమేర్‌పటేల్, అఖిల్ అహ్మద్, అఫ్రోజ్ ఖాన్‌తోపాటు నూతన కార్యవర్గ సభ్యులను శాలులతో సన్మానించారు. నూతన కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, ఖిజర్ పాషా, షేక్ వసీం, ఫిరోజ్ ఖాన్ ఇర్షాద్ అహ్మద్, వాజిద్ ఖాన్, రియాజ్ అహ్మద్, అస్లాం, కర్మ, హకీం, నదీం తదితరులు పాల్గొన్నారు.

### నూతన ఆర్థిక సంస్కరణల

# రూపశిల్పి మన్మోహన్ సింగ్

**కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి**



**ఆదిలాబాద్, మహా :** ఆర్థిక అస్థిరతతో కొట్టుమిట్టాడుతున్న భారత దేశంలో నూతన ఆర్థిక సంస్కరణల ద్వారా ప్రభుత్వ ప్రైవేటు పెట్టుబడులే కాకుండా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను తీసుకువచ్చి దేశీయ మార్కెట్లను కాపాడిన ఆర్థిక రాజనీతజ్ఞుడు దివంగత ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. బోథ్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద స్వర్గీయ డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, పట్టణ ప్రముఖులు, ప్రజలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంతోపాటు దేశంలో కరువు, వలసల నివారణకు ఉపాధి హామీ చట్టాన్ని, పోషకాహార లోపం లేకుండా ఆకలి చావులు ఉండవద్దని ఆహార భద్రత చట్టాన్ని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలనే ఉద్దేశంతో ఉచిత నిర్బంధ విద్య హక్కు చట్టాన్ని అమలు చేశారని, పాలనలో పారదర్శకత కోసం సమాచార హక్కు చట్టాన్ని తీసుకువచ్చి దేశంలో నూతన సంస్కరణలను తీసుకువచ్చింది ఆయన హయాంలోనే అని గుర్తుచేశారు. మన్మోహన్ సింగ్ లేని లోటు భారత ప్రజలతోపాటు అఖిల భారత కాంగ్రెస్ పార్టీకి లోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భోద్దు గంగారెడ్డి, మాజీ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, తాజా మాజీ ఎంపీటీసీలు చట్ల ఉమేష్, షేక్ నాజర్ అహ్మద్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బత్తుల రమేష్, భోజన్న, షేక్ షాకీర్, గట్ల గంగాధర్, ఉమేష్, పార్టీ సీనియర్ నాయకులు, కాంగ్రెస్ 'కార్యకర్తలు పాల్గొన్నారు.

# మన్మోహన్ సింగ్‌కు ప్రముఖుల నివాళులు






**మహా:** ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో గురువారం రాత్రి చికిత్స పొందుతూ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. నేడు ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం మాజీ ప్రధాని భౌతికకాయాన్ని ఆయన నివాసంలో పలువురు ప్రముఖులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు, కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీతోపాటు పలువురు మన్మోహన్ కు నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా దేశానికి మన్మోహన్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.




## అన్నా వర్సిటీ ఘటనకు నిరసనగా
# కొరడాతో కొట్టుకున్న అన్నామలై



**తమిళనాడు:** అన్నా యూనివర్సిటీలో 19 ఏళ్ల విద్యార్థినిపై లైంగికదాడి ఘటనను తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు కే అన్నామలై తీవ్రంగా ఖండించారు. ఆ ఘటనకు నిరసనగా ఆయన అంతకుముందే చేసిన వాగ్ధానం ప్రకారం శుక్రవారం కోయంబత్తూరులోని తన ఇంటి ముందు కొరడాతో ఆరు దెబ్బలు కొట్టుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 48 రోజులపాటు నిరాహార దీక్ష చేయనున్నట్లు చెప్పారు. డీఎంకే పాలనలో తమిళనాడు రాష్ట్రంలో అడుగడుగునా అన్యాయమే జరుగుతున్నదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ అన్యాయాలను నిరసిస్తూ తమను తాము కొరడాలతో కొట్టుకోవడం, తమను తాము శిక్షించుకోవడం అనేది తమిళనాడు సంస్కృతిలో భాగంగా ఉన్నదని ఆయన వివరించారు. పూర్వకాలం నుంచి ఉన్న సంప్రదాయాన్నే తాను ఇప్పుడు పాటించానని తెలిపారు. తన నిరసన ఏ వ్యక్తికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు.

కేవలం రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగానే తాను నిరసన తెలియజేస్తున్నానని అన్నామలై పేర్కొన్నారు. అన్నా యూనివర్సిటీలో ఇటీవల జరిగిన ఘటన అలాంటి అన్యాయాల్లో ఒకటని చెప్పారు. డీఎంకే అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సామాన్యులకు వ్యతిరేకంగా అన్యాయాలు జరుగుతూనే ఉన్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, పిల్లలు అన్యాయాలకు గురవుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో అవినీతి కూడా పెరిగిపోయిందని ఆరోపించారు. ఈ అన్యాయాలకు వ్యతిరేకంగానే తాను నిరసన తెలియజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం గద్దెదిగేవరకు తాను కాళ్లకు చెప్పులు కూడా వేసుకోబోనని ఆయన శపథం చేశారు. అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు.. తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్‌తో కలిసి దిగిన ఫొటోలను అన్నామలై గురువారం మీడియాకు వెల్లడించారు. ఆ సందర్భంగానే ఆయన రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేయనున్నట్లు అన్నామలై తెలిపారు. శుక్రవారం కొరడాతో ఆరుదెబ్బలు కొట్టుకుంటానని, ఆరోజు నుంచి 48 రోజులపాటు నిరాహార దీక్ష చేస్తానని, డీఎంకే అవినీతి పాలన ముగిసిపోయే వరకు తాను కాళ్లకు చెప్పులు వేసుకోబోనని అన్నామలై ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకారమే ఆయన కొరడాతో కొట్టుకున్నారు.

## రైతు సమస్యలపై
# చర్చించేందుకు సమయమివ్వండి



### రాష్ట్రపతికి ఎస్‌కేఎం లేఖ

న్యూఢిల్లీ: డిమాండ్ల సాధనకు రైతుల ఆందోళన, రైతు నేత జగ్జీత్ సింగ్ డల్లేవాల్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాసింది. వారి సమస్యలపై చర్చించేందుకు తమకు సమయమివ్వాలంటూ ఎస్‌కేఎం ఆ లేఖలో కోరింది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతోపాటు పలు డిమాండ్ల సాధన కోసం రైతులు ఆందోళన చేస్తున్నారని, డల్లేవాల్ ఆమరణ దీక్ష చేస్తున్నారని అందులో స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా 500 జిల్లాలకు చెందిన రైతులు ఇప్పటికే రాష్ట్రపతికి విజ్ఞాపన పత్రాలు సమర్పించారని, రైతు సమస్యలపై చర్చించేందుకు సమయం కేటాయించాలని ఎస్‌కేఎం ఆ లేఖ ద్వారా విజ్ఞప్తి చేసింది.



## డబ్ల్యూహెచ్‌వో నుంచి
# వైదొలగనున్న అమెరికా..?

**వాషింగ్టన్:** అధ్యక్షుడిగా అధికారం చేపట్టిన మొదటి రోజే డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకోబోతున్నారనే చర్చ నడుస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) నుంచి అమెరికా తప్పుకునేలా కీలక నిర్ణయం వెలువడుతుందని తెలుస్తున్నది. 'ట్రంప్ అధికారం చేపట్టిన మొదటి రోజు లేదా పాలన ప్రారంభమైన వెంటనే ఈ నిర్ణయం ఉంటుంది. ఇందుకు సంబంధించి నాకు కచ్చితమైన సమాచారముంది' అంటూ జార్జ్‌టౌన్ వర్సిటీకి చెందిన ఆరోగ్య నిపుణుడు లారెన్స్ గోస్టిన్ అన్నట్టు అమెరికా మీడియా కథనాలు వెలువడుతున్నాయి.
డబ్ల్యూహెచ్‌వోపై ట్రంప్ మొదట్నుంచీ తీవ్ర విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. చైనా జేబు సంస్థగా మారిందని, కొవిడ్19 సంక్షోభానికి చైనాను దోషిగా నిలబెట్టడంలో డబ్ల్యూహెచ్‌వో విఫలమైందని ఆయన ఆరోపించిన విషయం విధితమే. ఈ క్రమంలోనే ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం డబ్ల్యూహెచ్‌వో నుంచి అమెరికా ఉపసంహరణ ఖాయమన్న వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. డబ్ల్యూహెచ్‌వో విమర్శకులను అమెరికా ప్రజారోగ్యంలోని కీలక స్థానాల్ని ట్రంప్ భర్తీ చేసిన విషయం తెలిసిందే.

## లష్కరే తోయిబా
### డిప్యూటీ చీఫ్ మక్కి మృతి



**పాకిస్థాన్:** పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత ఉగ్రసంస్థ లష్కరే తోయిబా డిప్యూటీ చీఫ్ హాఫీజ్ అబ్దుల్ రెహమాన్ మక్కి మృతిచెందాడు. అతడు ముంబై ఉగ్రదాడి ప్రధాన సూత్రధారి హాఫీజ్ సయీద్ బావమరిది. మక్కి గత కొంత కాలంగా మధుమేహంతో బాధపడుతున్నాడు. శుక్రవారం ఉదయం గుండెపోటుతో లాహోర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మరణించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. 16 ఏళ్ల క్రితం అనగా 2008 నవంబర్ 26న పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే లష్కరే తోయిబా ముఠాకు చెందిన 10 మంది ఉగ్రవాదులు ముంబైలో మారణహోమానికి పాల్పడిన విషయం తెలిసిందే. కొబాలా సముద్ర తీరం వెంబడి దక్షిణ ముంబైలోకి ప్రవేశించిన ఈ ముఠా తాజ్ మహల్ ప్యాలెస్ హోటల్ సహా అనేక ప్రాంతాల్లో విచక్షణారహితంగా దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 166 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఉగ్ర దాడులకు మక్కి ఆర్థిక సాయం అందించాడు. మే 2019లో మక్కిని పాకిస్థాన్ ప్రభుత్వం అరెస్ట్ చేసింది. లాహోర్‌లో గృహనిర్బంధంలో ఉంచింది. 2020లో టెర్రర్ ఫైనాన్సింగ్‌కు సంబంధించిన కేసుల్లో పాకిస్థాన్ కోర్టు అతడిని దోషిగా తేల్చింది. ఈ మేరకు అతనికి జీవిత ఖైదు విధించింది. ఇక గతేడాది (2023) జనవరిలో యునైటెడ్ నేషన్స్ సెక్యూరిటీ కౌన్సిల్ కూడా మక్కిని ప్రపంచ ఉగ్రవాదిగా ప్రకటించింది. ముంబై ఉగ్రదాడితోపాటు మక్కికి ఎర్రకోట దాడిలో మక్కి ప్రమేయం ఉంది. దీంతో అతడిని భద్రతా సంస్థలు భారతదేశంలో వాంటెడ్ టెర్రరిస్ట్‌గా ప్రకటించిన విషయం తెలిసిందే.

# ఉక్రెయిన్ యుద్ధంలో విజయం సాధిస్తాం
### దేవుడు రష్యా వైపే ఉన్నాడు.. వ్లాదిమిర్ పుతిన్ కీలక వ్యాఖ్యలు



**మహా, జాతీయం:** రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలో తాము విజయం సాధిస్తామని తనకు పూర్తి నమ్మకం ఉందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. సుప్రీం యూరేషియన్ ఎకనామిక్ కౌన్సిల్‌లో ఆయన ఈమేరకు మాట్లాడారు. 'నేను దేవుణ్ణి నమ్ముతాను. ఆయన మావైపే ఉన్నాడు. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో 2025లో మాస్కో తప్పక విజయం సాధిస్తుంది. ఇదే విషయాన్ని నివేదికలు సైతం వెల్లడిస్తున్నాయి' అని పుతిన్ పేర్కొన్నారు.

ఉక్రెయిన్‌కు నాటోలో సభ్యత్వం కల్పించడాన్ని ఆలస్యం చేస్తూనే.. యుద్ధాన్ని ముగించాలని అమెరికా యోచిస్తుందని ఓ విలేకరి పేర్కొన్న అంశంపై పుతిన్ స్పందించారు. 'అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ 2021లోనూ ఇదే ప్రతిపాదన చేశారు. ఆయా ఒప్పందం మాస్కోకు ఆమోదయోగ్యంగా లేదని మేము పేర్కొన్నాం. ఈ యుద్ధాన్ని ఆపాలనే మేము ప్రయత్నిస్తున్నాం. దీనిలో మేము విజయం సాధిస్తాం. ఆర్థికరంగంలో మా లక్ష్యాలను సాధించడంతో పాటు సామాజిక సమస్యలు, సైనిక భద్రతకు సంబంధించిన సమస్యలు పరిష్కరిస్తాం' అని తెలిపారు. ఈసందర్భంగా కీవ్‌తో శాంతి చర్చలు నిర్వహించాలనే స్లొవేకియా ప్రతిపాదనను స్వాగతిస్తునట్లు వెల్లడించారు.

## అత్యధికంగా మధ్యప్రదేశ్‌లోనే
# పులుల మరణాలు

- తెలంగాణలో రెండు పులులు మృతి
- తాజా నివేదికలో వెల్లడించిన ఎన్టీసీఏ



ఢిల్లీ: పులులకు సంబంధించిన కీలక విషయాలను నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ(ఎన్టీసీఏ) తాజాగా వెల్లడించింది. దేశంలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పులుల మరణాలు గణనీయంగా తగ్గాయంటూ పేర్కొంది. పటిష్ట చర్యలు తీసుకోవడమే ఇందుకు కారణమని తెలిపింది. వణ్యప్రాణి చట్టాలను కఠినంగా అమలు చేయడం, అభయారణ్యాలలో వేటగాళ్ల కట్టడితోపాటు పలు ఇతర అంశాల కారణంగా దేశంలోని పులుల మరణాల సంఖ్య గణనీయంగా తగ్గిందంటూ స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి తాజా నివేదికను విడుదల చేసింది. గత ఏడాదిలో మొత్తం 182 పులులు మృతిచెందగా, ఈ ఏడాది 122 మరణాలు సంభవించినట్లు ఎన్టీసీఏ పేర్కొంది. అయితే, ఈ ఏడాది అత్యధికంగా మధ్యప్రదేశ్ లో 44 పులులు మరణించాయని, మహారాష్ట్రలో 21 పులుల మరణాలు సంభవించినట్లు పేర్కొంది. తెలంగాణలో రెండు పులుల మరణాలు సంభవించినట్లు వెల్లడించింది.

## కేంద్రమంత్రి చిరాగ్ ఆప్తుడి
# ఇంట్లో ఈడీ తనిఖీలు




**ఢిల్లీ:** కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్‌కు అత్యంత సన్నిహితుడైన హులాస్ పాండేను ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) టార్గెట్ చేసింది. ఢిల్లీ, బెంగళూరు, పాట్నాలోని ఆయన నివాసాలు, ఆఫీసుల్లో ఈడీ తనిఖీలు చేపట్టింది. వీటితోపాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ తనిఖీలు జరిపింది. కాగా, ఆర్థిక లావాదేవీలకు సంబంధించి హులాస్ పాండే అవకతవకలకు పాల్పడ్డారంటూ గతంలో ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే, ఈడీ మాత్రం తనిఖీలకు సంబంధించిన కారణాలను ఇంకా వెల్లడించలేదు. ఇదిలా ఉంటే... పాండే గతంలోనూ ఎమ్మెల్సీగానూ పనిచేశారు.

# నిగమ్‌బోధ్ ఘాట్‌లో మాజీ ప్రధాని మన్మోహన్ అంత్యక్రియలు..!



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పార్థివ దేహానికి అంత్య క్రియలు శనివారం అధికారిక లాంఛనాలతో జరుగుతాయని కేంద్ర హోంశాఖ శుక్రవారం తెలిపింది. ఢిల్లీలోని నిగమ్ బోధ్ ఘాట్‌లో శనివారం ఉదయం 11.45 గంటలకు ఆయన అంతిమ సంస్కారాలు జరుగుతాయని పేర్కొంది. సైనిక లాంఛనాలతో ఆయనకు అంతిమ వీడ్కోలు పలికేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని రక్షణ శాఖను కోరినట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది.


## బీమా ఆవిష్కరణలో
# టెకాడె నాయకత్వం



**మహా, హైదరాబాద్ :** 2025 రాబోతున్న తరుణంలో, బీమా పరిశ్రమ ఒక పరివర్తనాత్మక కూడలి వద్ద నిలిచింది. భారీ డేటా సెట్స్ చే నడిపించబడుతున్న సాంకేతికత, మా వ్యాపారము యొక్క ప్రతి అంశాన్ని పునర్నిర్మిస్తోంది మరియు బీమా యొక్క భవిష్యత్తును ఆవిష్కరించే, సమగ్రపరచే మరియు వినియోగదారుడి భారాలను విముక్తి చేసే వారిచే నిర్వచించబడుతోంది. ఇన్సూరర్స్ వ్యక్తిగతీకరించబడిన పరిష్కారాలు మరియు కమ్యూనికేషన్, అంతరాయాలు లేని డిజిటల్ అనుభవాలు మరియు వ్యూహాత్మక భాగస్వామ్యాలు అవసరమైన ప్రపంచములో అభివృద్ధి సవాళ్ళను ఎదుర్కొంటున్నారు. ముందున్న ప్రయాణము మరింత కనెక్ట్ అయినది, వినియోగదారుకేంద్రకమైనది మరియు ఇదివరకు కంటే మరింత ధృఢమైన బీమా యొక్క భవిష్యత్తుకు పునాదులైన నాలుగు కీలక స్తంభాల ఆధారంగా నడపబడుతుంది. కస్టమర్ సపోర్ట్ నుండి ప్రైసింగ్ మరియు క్లెయిమ్స్ ప్రాసెసింగ్ వరకు ప్రతిఒక్కదానిని పెంచుతున్న జనరేటివ్ ఏఐతో క్లెయిమ్స్ నిర్వహణ, అండర్ రైటింగ్ మరియు మోసాలను కనుగొనడములో కార్యాచరణలను మార్చడాన్ని ఏఐ కొనసాగిస్తుంది.

## దేశానికే కాదు..
# నాకు వ్యక్తిగతంగానూ తీరనిలోటు
### మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాపం
#### భారత ఆర్థికవ్యవస్థకు మన్మోహన్ సింగ్ రూపశిల్పి: మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్

**ఢిల్లీ:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తీవ్ర సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ భారత ఆర్థిక వ్యవస్థకు రూపశిల్పి అంటూ ఆయన కొనియాడారు. మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరనిలోటు మాత్రమే కాదని, వ్యక్తగతంగా తనకు కూడా లోటేనంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మన్మోహన్ సింగ్ తనకు చాలాకాలంగా తెలుసని, పొలైట్‌నెస్‌కు ఆయనొక గొప్ప ఉదాహరణ అంటూ అభివర్ణించారు. మన్మోహన్ సింగ్ భారత ఆర్థిక వ్యవస్థకు రూపశిల్పిగా తాను భావిస్తానని, తాను ఆయనకు నివాళులు అర్పిస్తున్నానని రామ్‌నాథ్ కోవింద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక సెల్ఫీ వీడియోను రిలీజ్ చేశారు. వృద్ధాప్య సంబంధ అనారోగ్యంతో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గురువారం ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసిన విషయం తెలిసిందే.



# అవినీతి వ్యతిరేకి మన్మోహన్ సింగ్
### ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశ చూపిన నాయకుడు.. అన్నాహజారే సంతాపం



**మహా, జాతీయం:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే సంతాపం తెలిపారు. ఆయన ఎప్పుడూ సామాజిక సంక్షేమం, దేశాభ్యున్నతికే ప్రాధాన్యత ఇచ్చారని కొనియాడారు. మహారాష్ట్రలోని తన స్వగ్రామంలో పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. 'పుట్టినవారు మరణిస్తారు. కానీ, వారి జ్ఞాపకాలు, వారసత్వం మాత్రం నిలిచిపోతాయి. మన్మోహన్ సింగ్ దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపించారు' అని అన్నారు. తాను 2010 తొలినాళ్లలో అవినీతి వ్యతిరేక ఉద్యమం చేపట్టినప్పటి విషయాలను ఈ సందర్భంగా అన్నాహజారే గుర్తు చేసుకున్నారు. ఆయన తనను చర్చలకు ఆహ్వానించారని, త్వరతగతిన నిర్ణయాలు తీసుకునేవారని తెలిపారు. అవినీతిని వ్యతిరేకించిన మన్మోహన్ సింగ్ లోక్‌పాల్, లోకాయుక్త చట్టానికి సంబంధించి తక్షణ నిర్ణయాలు తీసుకున్నారని, నిత్యం దేశం గురించి, దేశ ప్రజలకు ఇంకా ఏం చేయాలనే ఆలోచించేవారని తెలిపారు. మన్మోహన్ భౌతికంగా దూరమైనా.. ఆయన ప్రజల జ్ఞాపకాల్లో ఎప్పటికీ నిలిచిపోతారని తెలిపారు.

## ఆగ్రా రికార్డును
# బ్రేక్ చేసిన అయోధ్య

- తాజమహల్ కన్నా అత్యధికంగా పర్యాటకులు
- వివరాలను వెల్లడించిన పర్యాటక మంత్రిత్వ శాఖ



**ఢిల్లీ:** ఆగ్రాలోని తాజ్ మహల్ రికార్డును అయోధ్య రామ మందిరం బ్రేక్ చేసింది. పర్యాటకుల సందర్శకుల స్థానంలో మొదటగా నిలిచింది. అయితే, ఇప్పటివరకు పర్యాటకుల సంఖ్యలో తాజ్ మహల్ అగ్రస్థానంలో ఉండేది. ఇప్పుడు ఆ స్థానాన్ని అయోధ్య రామమందిరం వెనక్కి నెట్టింది. 2024 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు అత్యధికంగా పర్యాటకులు సందర్శించిన నగరంగా అయోధ్య రికార్డును సొంతం చేసుకుంది. గడిచిన 9 నెలల్లో 12.51 కోట్ల మంది పర్యాటకులు ఆగ్రాను సందర్శించగా, 13.55 కోట్ల మంది పర్యాటకులు అయోధ్యను సందర్శించారు. ఈ వివరాలను పర్యాటక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇదిలా ఉంటే ఈ ఏడాది జనవరి 22న అట్టహాసంగా అయోధ్య రామమందిరాన్ని ప్రారంభమైన విషయం తెలిసిందే.

ANN తెలుగు
మహా పత్రిక 07
శనివారం, హైదరాబాద్ | 28-12-2024 | వ్యాపార వార్తలు | BUSINESS NEWS
WWW.MAHAADAILY.COM



# బిర్యానీయే టాప్

**జొమాటో 2024 నివేదిక విడుదల**

**ఏడాదిలో 9.13 కోట్ల బిర్యానీ ఆర్డర్లు**
**తర్వాత స్థానంలో పిజ్జా**

**మహా:** ప్రముఖ ఆన్ లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో 2024 సంవత్సర ముగింపు నివేదిక విడుదల చేసింది. ఇందులో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. జనాలు ఈ ఏడాది అత్యధికంగా ఆర్డర్ చేసిన ఫుడ్ ఐటెమ్స్ లో బిర్యానీదే నెంబర్ వన్ ప్లేస్ అని జొమాటో వెల్లడించింది. 2024లో 9,13,99,110 బిర్యానీ ఆర్డర్లు వచ్చాయని తెలిపింది. ఆ తర్వాత స్థానంలో 5,84,46,908 పిజ్జా ఆర్డర్లు వచ్చాయట. ఇక, రైల్వే టికెటింగ్ పోర్టల్ ఐఆర్ సీటీసీతోనూ జొమాటోకు భాగస్వామ్యం ఉంది. జొమాటో నిర్దేశిత రైల్వే స్టేషన్ల నుంచి, రైలు ప్రయాణికులకు వారు కోరుకున్న ఆహారాన్ని సరఫరా చేస్తుంటుంది. ఓసారి ఓ వ్యక్తి రైలులో ప్రయాణిస్తూ 120 మంచూరియా కాంబోలు ఆర్డర్ చేశాడని జొమాటో తన నివేదికలో వెల్లడించింది. అయితే అవన్నీ అతడి ఒక్కడి కోసమే కాదట... ఆ కంపార్ట్ మెంట్ లో ఉన్న అందరి కోసం ఆర్డర్ చేశాడని వివరించింది. ఇక, తన నివేదికలో మరికొన్ని ఆసక్తికర అంశాలను కూడా జొమాటో పంచుకుంది. ఢిల్లీకి చెందిన ఓ ఆహార ప్రియుడు ఈ ఏడాది 1,377 రెస్టారెంట్ల నుంచి ఫుడ్ తెప్పించుకున్నాడని వెల్లడించింది. 2024లో... 17 మిలియన్ ప్యాక్ ల మ్యాగీ నూడిల్స్, 10 మిలియన్ క్యాన్ల కోకాకోలా ఆర్డర్లు బుక్ అయ్యాయట. ఒక వ్యక్తి 1,203 స్ప్రైట్ బాటిల్స్ ఆర్డర్ చేసినట్టు జొమాటో తెలిపింది.

# భద్రత బలోపేతం.. రికార్డు ప్రయాణాలు..

## గ్లోబల్ హబ్‌గా పౌర విమానయానం..!



కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహం, మెరుగైన వసతులు, అంతర్జాతీయ ఏవియేషన్ హబ్స్ అభివృద్ధితో దేశీయ పౌర విమానయాన రంగం 2024లో గణనీయ పురోగతి సాధించింది. పౌర విమానయాన రంగం అభివృద్ధికి కేంద్ర విధానాలు సహాయకారిగా నిలిచాయి. తద్వారా దేశవ్యాప్తంగా భారతీయులు తమకు నచ్చిన క్షేత్రాలకు విమానయానం చేసేందుకు డిమాండ్ పెరిగింది. దేశంలో తొలిసారి ఒక్కరోజే ఐదు లక్షల మంది విమాన ప్రయాణం చేసిన రికార్డు నమోదైంది. నవంబర్ 17న దేశవ్యాప్తంగా 5,05,412 మంది ప్రయాణికులు విమానాల్లో పర్యటించారు. 3100కి పైగా విమానాలు ఐదు లక్షల మందికి పైగా ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చడంతో భారత్.. గ్లోబల్ ఏవియేషన్ హబ్ గా అవతరిస్తోందనడానికి నిదర్శనంగా నిలుస్తోంది. 2024 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 15 శాతం విమాన ప్రయాణికులు పెరిగారు. ఈ ఏడాది 37.6 కోట్ల మంది ప్రయాణికులు భారత విమానాశ్రయాల మీదుగా ప్రయాణించారు. తద్వారా ప్రపంచంలోకెల్లా మూడో అతిపెద్ద విమానయాన రంగంగా నిలిచింది. నవంబర్ నెలలో 999 బాంబు బెదిరింపు కాల్స్ లేదా మెసేజ్ లు వచ్చాయి. బాంబు బెదిరింపు కాల్స్, మెసేజీలపై జనవరి నుంచి నవంబర్ మధ్య 256 కేసులు నమోదైతే, అక్టోబర్ 14 నవంబర్ 14 మధ్య 163 కేసులు నమోదు కాగా, 12 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. దేశ ప్రజలందరికీ విమానయాన సర్వీసులు అందుబాటులోకి తేవడానికి కేంద్రం 'ఉడాన్' స్కీమ్ తెచ్చింది. తూర్పు నుంచి పశ్చిమానికి, ఉత్తరం నుంచి దక్షిణానికి మధ్య 34 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను అనుసంధానించేందుకు ఉడాన్ స్కీమ్ ఉపకరించింది. దేశవ్యాప్తంగా నవంబర్ 25 నాటికి ఉడాన్ స్కీం సాయంతో 86 విమానాశ్రయాల పరిధిలో 609 రూట్లను అనుసంధానించారు. పౌర విమానయానరంగాన్ని మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. అధునాతన భద్రతా ఏర్పాట్లతో ప్రయాణికులకు భద్రతా సౌకర్యం మరింత మెరుగుపరిచారు. సీసీటీవీ కెమెరాలు, డ్యుయల్ వ్యూ ఎక్స్‌బీఐఎస్, బయో మెట్రిక్ యాక్సెస్ కంట్రోల్ సిస్టమ్, క్యూ మేనేజ్ మెంట్ సిస్టమ్, ఆటోమోటివ్ ట్రే రిట్రైవల్ సిస్టమ్, పెరిమీటర్ ఇంట్రుషన్ డిటెక్షన్ సిస్టమ్, రిమోట్ స్క్రీనింగ్ తదితర సేఫ్టీ పద్ధతులను దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో అమల్లోకి తెచ్చారు.



# రికార్డు స్థాయిలో పడిపోయిన రూపాయి

**తొలిసారి రూ.85.50 దాటి ముందుకు**

**వరుసగా తొమ్మిదోరోజు క్షీణత**

**మహా:** డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి తాజాగా రికార్డు కనిష్ట స్థాయికి పడిపోయింది. రూపాయి 85.50 మార్కును దాటడం ఇదే తొలిసారికాగా.. ఈ నెలలో భారీగా పడిపోయి 85.73కి చేరుకుంది. నాన్-డెలివరేబుల్ ఫార్వర్డ్ మార్కెట్‌లో డాలర్‌కు బలమైన డిమాండ్ కారణంగా ఇది వరుసగా తొమ్మిదో రోజు క్షీణతలో కొనసాగింది. ఈ ఏడాది ఇప్పటివరకు యుఎస్ డాలర్‌తో పోలిస్తే రూపాయి 3 శాతం బలహీనపడింది. వరుసగా ఏడవ సంవత్సరం వార్షిక నష్టాన్ని నమోదు చేసే దిశగా పయనిస్తోంది.

# రూ.79 వేలు దాటిన బంగారం..

## అదే బాటలో వెండి..!


అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ పతనం కావడంతోపాటు జ్యువెల్లరీ వ్యాపారుల నుంచి కొనుగోళ్లకు మద్దతు లభించడం, ఉక్రెయిన్-రష్యా యుద్ధం, మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో ఇన్వెస్టర్లకు బంగారం స్వర్గధామంగా కనిపిస్తున్నది. దీంతో దేశీయ బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు పెరిగిపోయాయి. దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం తులం బంగారం ధర రూ.350 పుంజుకుని రూ.79,200లకు చేరుకున్నది. గురువారం తులం బంగారం ధర 78,850 వద్ద స్థిర పడింది. శుక్రవారం 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.350 పెరిగి రూ.78,800 పలికింది. ఇక వరుసగా నాలుగో సెషన్‌లో శుక్రవారం కిలో వెండి ధర రూ.900 వృద్ధి చెంది రూ.91,700లకు చేరుకున్నది. నాలుగు సెషన్లలో కిలో వెండి ధర రూ.3,550 వృద్ధి చెందింది. నెలాఖరులో బ్యాంకర్లు, దిగుమతి దారుల నుంచి డిమాండ్ పెరిగిపోవడంతో డాలర్‌పై రూపాయి విలువ భారీగా పతనమైంది. శుక్రవారం ఫారెక్స్ మార్కెట్ ఇంట్రాడే ట్రేడింగ్‌లో అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ దాదాపు రెండేండ్ల రూ.85.80లకు పతనమైంది. తిరిగి ఆర్బీఐ జోక్యంతో ట్రేడింగ్ ముగిసే సమయానికి 23 పైసల నష్టంతో రూ.85.50 వద్ద స్థిర పడింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో గోల్డ్ కాంట్రాక్ట్ ఫిబ్రవరి డెలివరీ ధర రూ.56 క్షీణించి రూ.76,771లకు చేరుకున్నది. మార్చి డెలివరీ సిల్వర్ కాంట్రాక్ట్స్ కిలో ధర రూ.27 పతనమై రూ.89,609లకు చేరుకున్నది. కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో ఔన్స్ గోల్డ్ ధర 13.70 డాలర్లు పడిపోయి 2,640.20 డాలర్లు పలికింది. కామెక్స్ సిల్వర్ ఫ్యూచర్స్‌లో ఔన్స్ వెండి ధర 0.74 శాతం పతనంతో 30.17 డాలర్లకు చేరుకుంది.



# క్రీడా వార్తలు | SPORTS NEWS

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న పీవీ సింధు దంపతులు

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని భారత స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు దర్శించుకున్నారు. తన భర్త వెంకట దత్తసాయి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న సింధు దంపతులకు తితిదే అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సింధు దంపతులు స్వామి వారి అభిషేక సేవలో పాల్గొన్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వారికి పండితులు ఆశీర్వచనం చేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. కాగా, పీవీ సింధు - వెంకట దత్తసాయి వివాహం ఈనెల 22న ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లోని ఓ సరస్సులో 21 ఎకరాల్లో విస్తరించిన ఒక దీవిలో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ జంట ఒక్కటైంది. ఇక పెళ్లికి సంబంధించిన ఫొటోలను కూడా సింధు సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో గ్రాండ్‌గా రిసెప్షన్ కూడా జరిగింది. పెళ్లి, రిసెప్షన్‌కు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.





# మన్మోహన్‌సింగ్‌కు క్రికెట్ జట్టు నివాళి

**చేతికి నల్లబ్యాండ్‌లతో బరిలోకి**

**మహా, జాతీయం:** భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు. ప్రస్తుతం మెల్‌బోర్న్‌లో ఉన్న భారత క్రికెట్ జట్టు సైతం మన్మోహన్‌కు నివాళులర్పించింది. ఆయన గౌరవార్థం మెల్‌బోర్న్ టెస్ట్‌లో రెండో రోజు టీమ్ ఇండియా ఆటగాళ్లంతా చేతికి నల్లబ్యాండ్‌లు ధరించి బరిలోకి దిగారు. ఈ మేరకు ఆటగాళ్లు నల్ల బ్యాండ్‌లతో ఉన్న ఫొటోలను బీసీసీఐ ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. మెల్‌బోర్న్ వేదికగా జరుగుతున్న నాలుగో టెస్ట్ రెండో రోజు టీమ్ ఇండియా రెండు వికెట్లు కోల్పోయి 103 పరుగులు చేసింది. ఓపెనర్ జైశ్వాల్ ఆఫ్ సెంచరీ చేశారు. ఆస్ట్రేలియా 474 రన్స్‌కు ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఆలౌటైంది.

# సెమీస్‌కు బెంగాల్



**హైదరాబాద్, ఆట ప్రతినిధి :** ప్రతిష్ఠాత్మక ఫుట్‌బాల్ టోర్నీ సంతోష్ ట్రోఫీలో పశ్చిమ బెంగాల్ జట్టు సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది. బుధవారం హైదరాబాద్‌లోని డెక్కన్ ఏరీనా వేదికగా జరిగిన మ్యాచ్‌లో బెంగాల్.. 31తో ఒడిషాను ఓడించింది. ఈ టోర్నీలో బెంగాల్ సెమీస్‌కు చేరడం ఇది 52వ సారి కావడం విశేషం. ఒడిషా తరఫున రాకేశ్ ఓరమ్ 25వ నిమిషంలో తొలి గోల్ చేసి ఆ జట్టును ఆధిక్యంలోకి తీసుకొచ్చినా ఆ తర్వాత బెంగాల్ పుంజుకుంది. రాబొ హన్స్‌డ రెండు గోల్స్ చేయగా సబ్‌స్టిట్యూట్ మనొటొస్ మాఝి ఒక గోల్ చేశాడు.



# జైస్వాల్ 9వ హాఫ్ సెంచరీ

**మెల్‌బోర్న్:** యశస్వి జైస్వాల్హాఫ్ల సెంచరీ కొట్టాడు. మెల్‌బోర్న్ టెస్టు ఫస్ట్ ఇన్నింగ్స్‌లో అతను నిలకడగా ఆడుతున్నాడు. టెస్టుల్లో 9వ హాఫ్ సెంచరీ నమోదు చేశాడతను. 81బంతుల్లో జైస్వాల్ అర్ధశతకాన్ని పూర్తి చేశాడు. మూడవ సెషన్‌లో కోహ్లీ, జైస్వాల్ ఆచితూచి ఆడుతున్నారు. కోహ్లీ కూడా నెమ్మదిగా స్కోరింగ్ చేస్తున్నాడు. ఆ ఇద్దరూ మూడో వికెట్‌కు ఇప్పటి వరకు 79 రన్స్ జోడించారు. తాజా సమాచారం ప్రకారం ఇండియా రెండు వికెట్లు కోల్పోయి 130 రన్స్ చేసింది. జైస్వాల్ 65, కోహ్లీ 30 రన్స్‌తో క్రీజ్‌లో ఉన్నారు.

# జింబాబ్వే రికార్డు స్కోరు

**బులవాయొ :** టెస్టులలో జింబాబ్వే రికార్డు స్కోరు సాధించింది. అఫ్గానిస్థాన్‌తో బులవాయొలో జరుగుతున్న తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 586 పరుగులు చేసింది. టెస్టులలో జింబాబ్వేకు ఇదే అత్యుత్తమ స్కోరు (అంతకుముందు వెస్టిండీస్‌తో 563/9). జింబాబ్వే బ్యాటర్లలో సీన్ విలియమ్స్ (154), బ్రియాన్ బెన్నెట్ (110), కెప్టెన్ క్రెయిగ్ ఎర్విన్ (104) శతకాలతో మెరవగా బెన్ కరన్ (68) రాణించాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన అఫ్గాన్.. 30 ఓవర్లలో 95/2 పరుగులు చేసింది.





# సెమీఫైనల్లో యూపీ, పాట్నా

**పూణె:** ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) తాజా ఎడిషన్‌లో యూపీ యోధాస్, పాట్నా పైరేట్స్ సెమీస్‌కు అర్హత సాధించాయి. బుధవారం పూణెలోని శ్రీ శివ్ ఛత్రపతి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన తొలి ఎలిమినేటర్‌లో యూపీ.. 46-18తో జైపూర్ పింక్ పాంథర్స్‌పై జయభేరి మోగించింది. యూపీ తరఫున రైడర్ భవానీ రాజ్‌పుత్ ఏకంగా 12 పాయింట్లతో మెరిశాడు. రెండో ఎలిమినేటర్‌లో పాట్నా.. 31-23తో యూ ముంబాపై గెలిచింది. పాట్నా నుంచి అయన్ 10 పాయింట్లు సాధించగా దేవాంక్ 6 పాయింట్లతో రాణించాడు. గురువారం జరగబోయే తొలి సెమీస్‌లో యూపీ.. హర్యానా స్టీలర్స్‌తో అమీతుమీ తేల్చుకోనుండగా రెండో సెమీస్‌లో దబాంగ్ ఢిల్లీ.. పాట్నా పైరేట్స్‌ను ఢీకొననుంది.



## రెండు పార్టులుగా విజయ్ దేవరకొండ, గౌతమ్ తిన్ననూరి ప్రాజెక్ట్.!

టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ, జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్ లో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. 'వీడీ12' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్ రానుండగా విజయ్ దేవరకొండ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తెరకెక్కుతుంది. సితార ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. అయితే ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు నిర్మాత నాగవంశీ. ఆయన మాట్లాడుతూ.. వీడీ12 ప్రాజెక్ట్ రెండు పార్టులుగా రాబోతుందని ప్రకటించాడు. ఈ ఆలోచన సినిమా తీస్తున్న టైంలో రాలేదని.. షూటింగ్ స్టార్ట్ అవ్వకముందే ఈ ఆలోచన వచ్చినట్లు తెలిపాడు. అయితే ఈ రెండు పార్టులలో రెండు వేరు వేరు కథలు ఉంటాయని నాగవంశీ చెప్పకొచ్చాడు. మరోవైపు ఈ సినిమాను వచ్చే ఏడాది మార్చిలో తీసుకురావడానికి ప్లాన్ చేస్తున్నట్లు తెలిపాడు. ఒకవేళ ఆ టైంలో పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు ఉంటే తమ సినిమాను వాయిదా వేయనునట్లు చెప్పకొచ్చాడు.




## మనం చేయగలం

### ట్రెండింగ్‌లో సమంత మార్నింగ్ మోటివేషన్

కష్టతర సమయాల్లో ఎలా ఉండాలో కొంతమంది సెలబ్రిటీలను చూసి నేర్చుకోవచ్చు. అలాంటి వారి జాబితాలో టాప్‌లో ఉంటుంది చెన్నై సుందరి సమంత. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే ఈ భామ ఎప్పటికప్పుడు ఏదో ఒక పోస్ట్‌తో ఫాలోవర్లు, అభిమానుల్లో జోష్ నింపుతూంటుంది. తాజాగా ఉదయాన్నే మోటివేషన్ క్లాసులు చెబుతోంది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్ట్ నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. మార్నింగ్ మోటివేషన్.. మనం చేయగలం సామ్ మీ కలలను ఫాలో అవండి.. వాటికి మార్గం తెలుసు.. కొటేషన్‌ను హైలెట్ చేస్తూ.. బహుశా చూస్తూ కూర్చోవడం మంచిది. లేదంటే కాసేపు వేచి ఉండవచ్చు. బిజీ ప్రపంచంలో మీకు కావలసిందల్లా సాధారణ జీవితం. ప్రణాళిక లేకపోవడమనేది కూడా ప్రణాళికలో భాగమే కావచ్చు.. చక్కర్లు కొట్టడానికి.. హ్యాపీ హాలీడేస్ అంటూ క్యాప్షన్ ఇచ్చింది. సమంత ఓ వైపు బెడ్‌పై దుప్పటి కప్పుకొని హాయిగా నిద్రపోతున్న స్టిల్.. మరోవైపు వర్కవుట్ స్టిల్‌ను షేర్ చేయగా.. ఇప్పుడీ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. గతేడాది శాకుంతలం, ఖుషి సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చింది సామ్. ఆ తర్వాత హిందీలో వరుణ్ ధవన్‌తో సిటడెల్ వెబ్‌సిరీస్‌లో నటించింది. ఈ ప్రాజెక్టు తర్వాత సామ్ నుంచి కొత్త సినిమా ప్రకటన రావాల్సి ఉంది.



## యువతిపై లైంగిక వేధింపులు

### బుల్లితెర నటుడు అరెస్ట్

యువతిపై లైంగిక వేధింపుల కేసులో కన్నడ బుల్లితెర నటుడు చరిత్ బాలప్ప అరెస్ట్ అయ్యాడు. చరిత్ తనను ప్రేమిస్తున్నానని అబద్ధం చెప్పి బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడని ఓ యువతి ఫిర్యాదు చేయడంతో అతడిని బెంగళూరుకు చెందిన రాజరాజేశ్వరి నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. గత ఏడాది చరిత్‌తో పరిచయం ఏర్పడిందని.. అయితే ప్రేమ నెపంతో తనతో శారీరక సంబంధం పెట్టుకున్నాడు.. ఆ తర్వాత డబ్బులు ఇవ్వాలంటూ చిత్రహింసలు పెట్టేవాడు. అందుకు అంగీకరించకపోవడంతో తన ప్రైవేట్ ఫోటోలు, వీడియోలు లీక్ చేస్తామని బెదిరించినట్లు యువతి ఫిర్యాదులో పేర్కొంది. అయితే ఈ ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు శుక్రవారం అతడిని అదుపులోకి తీసుకున్నారు.

## మాస్ యాక్షన్ డ్రామా..


### కిచ్చా సుదీప్ మ్యాక్స్ ఎలా ఉందంటే..?

కన్నడ స్టార్ యాక్టర్ కిచ్చా సుదీప్ విక్రాంత్ రోన, కబ్జా సినిమాల తర్వాత నటించిన సినిమా మ్యాక్స్. ఈగ సినిమాతో తెలుగులో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న ఈ మల్టీ టాలెంటెడ్ యాక్టర్ కబ్జా సినిమా తర్వాత మ్యాక్స్‌తో తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చాడు. విజయ్ కార్తికేయన్ డైరెక్షన్ (డెబ్యూ)లో యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ మూవీ తెలుగు వెర్షన్ నేడు గ్రాండ్‌గా విడుదలైంది. మరి సుదీప్ అభిమానులు, యాక్షన్ మూవీ లవర్స్‌కు కావాల్సిన ఎలిమెంట్స్ ఉన్నాయా..? ఇంతకీ సినిమా నెటిజన్లు ఏమంటున్నారో ఓ లుక్కేస్తే..




**బలమైన మాస్ యాక్షన్ డ్రామా..**

డెబ్యూ విజయ్ కార్తికేయన్ బలమైన మాస్ యాక్షన్ డ్రామాను అందించాడని.. గ్రిప్పింగ్‌గా సాగే స్క్రీన్ ప్లేతో కథను నడిపించాడని అంటున్నారు. సినిమాటోగ్రఫీ, సంగీతం, నిర్మాణ విలువలు, పర్‌ఫెక్ట్ ఎడిటింగ్‌తో హద్దులు దాటకుండా తీసిన వినోదభరితమైన యాక్షన్ సినిమా అని చెబుతున్నారు. కిచ్చా సుదీప్ నుండి సాలిడ్ పెర్ఫార్మెన్స్‌తో వచ్చిన డీసెంట్ యాక్షన్ డ్రామా. మాస్ యాక్షన్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులు చూడదగ్గ సినిమా. యాక్షన్ ప్రియులకు విజువల్ ఫీస్ట్‌లా ఉంటుందని నెటిజన్ల టాక్. ఈ సినిమాలో కిచ్చా సుదీప్ యాక్టింగ్, స్క్రీన్ ప్రజెంటేషన్, విజయ్‌కార్తికేయ డైరెక్షన్, స్క్రీన్‌ప్లే అజనీష్ బి లోక్‌నాథ్ బీజీఎం స్టోరీ టెల్లింగ్, స్క్రీన్ టైం పాజిటివ్ అంశాలు.. నెగెటివ్ అంశాలు ఏం లేవు. బాద్ షా బ్యాంగ్‌తో కమ్ బ్యాక్ ఇచ్చాడని ఓ నెటిజన్ కామెంట్ పెట్టాడు.




## సల్మాన్ ఖాన్ సికందర్ టీజర్ వాయిదా.. కారణమిదే..!

బాలీవుడ్ స్టార్ యాక్టర్ సల్మాన్ ఖాన్ కాంపౌండ్ నుంచి వస్తోన్న మోస్ట్ ఎవెయిటెడ్ సినిమాల్లో ఒకటి 'సికందర్'. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2025 ఈద్ కానుకగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. మేకర్స్ ముందుగా ప్రకటించిన ప్రకారం టీజర్‌ను ఇవాళ ఉదయం 11:07 నిమిషాలకు లాంచ్ చేయాల్సి ఉంది.


అయితే మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ (Manmohan Singh) గురువారం రాత్రి కన్నుమూసిన విషయం తెలిసిందే. దేశమంతా సంతాపం ప్రకటిస్తున్న ఈ సమయంలో ఆయన మృతికి సంతాపంగా టీజర్ లాంచ్ ఈవెంట్‌ను వాయిదా వేస్తున్నాం. టీజర్‌ను రేపు ఇదే (ఉదయం 11:07) సమయానికి లాంచ్ చేస్తామని అధికారిక ఖాతాలో ట్వీట్ చేసింది నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్. సికిందర్‌లో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా నిర్మిస్తుండగా.. సత్యరాజ్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. సమాజంలోని అవినీతి, నేరాలకు వ్యతిరేకంగా పోరాడే వ్యక్తి కథ నేపథ్యంలో ఈ సినిమా ఉండబోతుందని ఇన్‌సైడ్ టాక్.

## అతడు అన్న మాటలు ఏడేండ్లు బాధించాయి : ఏఆర్ రెహమాన్

దిగ్గజ సంగీత దర్శకుడు ఆస్కార్ అవార్డు విజేత ఏఆర్ రెహమాన్ వివాదాస్పద వార్తలకు వ్యాఖ్యలకు దూరంగా ఉంటాడన్న విషయం తెలిసిందే. అయితే మొన్నటివరకు సైలెంట్‌గా ఉన్న అతడి జీవితం విడాకుల వార్తతో ఒక్కసారిగా హాట్ టాపిక్ అయ్యింది. తన భార్య సైరా భానుతో విడిపోతున్నట్లు ఏఆర్ రెహమాన్ ప్రకటించడంతో అందరూ ఒక్కసారిగా షాక్ తిన్నారు. దీంతో ఈ వివాదం సద్దుమణగకముందే రెహమాన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.

ఒక ఇంటర్వ్యూలో భాగంగా రెహమాన్ మాట్లాడుతూ.. తన కెరీర్‌లో ఎదురైన చేదు సంఘటనలు గుర్తు చేసుకుని కాస్త ఎమోషనల్ అయ్యాడు. ఈ ఘటన 1985-1986 మధ్యలో జరిగింది. ఈ ఘటన తర్వాత నాలో చాలా మార్పులు వచ్చాయి అంటూ ఏఆర్ అన్నారు.

నేను సంగీత దర్శకుడిగా ఎదుగుతున్న సమయంలో ఓ గిటారిస్ట్నా వద్దకు ఫుల్‌గా తాగి వచ్చి.. నీకు సంగీతం వచ్చా.. నువ్వు ఏం ప్లే చేస్తున్నావు.. నువ్వు చేసేది సినిమాకు సంబంధించింది అంటూ కామెంట్ చేశాడు. అతడు అలా అనడంతో చాలా ఎమోషనల్ అయ్యాను. అయితే అతడి మాటలు నేను అర్థం చేసుకోవడానికి నాకు వారం పట్టింది. ఆ సమయం నాకు బాగా బాధగా అనిపించింది. ఈ విషయం నేను తర్వాత ఆలోచించినప్పుడు అతడు చెప్పింది నిజమేననిపించింది. నేను ఎవరి కోసం అయితే వర్క్ చేస్తున్నానో ఆ కంపోజర్ల ప్రభావం నాపై ఉంటుందని తర్వాత తెలిసింది. దీంతో తన స్టైల్ ఎలా మార్చుకుంటే బాగుంటుందని ఫోకస్ చేశాను. ఈ విషయం మ్యూజిక్ విషయంలో నా స్టైల్ మార్చుకునేలా చేసింది. అయితే అతడు అన్న మాటలు మాత్రం మర్చిపోవడానికి, బాధలోనుంచి బయటకు వచ్చేందుకు దాదాపు ఏడు సంవత్సరాలు పట్టిందని రెహమాన్ తెలిపారు.



## 21 రోజుల్లో రూ.1705 కోట్లు..

### పుష్ప-2 సరికొత్త రికార్డు

బాక్సాఫీస్ వద్ద 'పుష్ప-2' హవా కొనసాగుతూనే ఉంది. అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా సరికొత్త రికార్డులను సృష్టిస్తున్నది. తాజాగా మరో రికార్డు ఈ సినిమా ఖాతాలో చేరింది. 21రోజుల్లో 1705 కోట్ల వసూళ్లు సాధించిన తొలి భారతీయ చిత్రంగా 'పుష్ప-2' నిలిచింది. దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ ఈ సినిమా జైత్రయాత్రను సాగిస్తున్నది. విడుదలకు ముందే ప్రీరిలీజ్ బిజినెస్ విషయంలో ఇండియాలో సరికొత్త రికార్డు సృష్టించిన ఈ సినిమా ప్రీమియర్‌షోల నుంచే సంచలనాలతో దూసుకుపోతున్నదని, ముమ్ముందు మరిన్ని రికార్డులను అధిగమించడం ఖాయమని నిర్మాతలు ధీమా వ్యక్తం చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఏర్నేని, రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 5న 'పుష్ప-2' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకొచ్చింది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com